రిటైర్డ్ తహసీల్దార్ ఫోర్జరీ సంతకంతో పట్టాలు

బోగస్ పట్టాలతో పేదల ఇంటి స్థలాలు కబ్జా

మితిమీరిన వైసీపీ నాయకుడి ఆగడాలు

పట్టించుకోని రెవెన్యూ అధికారులు





వెంగమ నాయుడు కాలనీ

పేదల ప్లాట్లతో దందా..!

నిరుపేదలకు ప్రభుత్వం ఇచ్చిన ప్లాట్లను ఓ వైసీపీ నాయకుడు యథేచ్ఛగా విక్రయించేస్తున్నాడు. గతంలో పేదలకు ప్రభుత్వం ప్లాట్లు కేటాయించింది. ఆర్థిక ఇబ్బందులతో కొందరు ఇళ్లు కట్టుకోలేకపోయారు. అలా ఖాళీగా ఉన్న స్థలాలను గుర్తించి ఆ నాయకుడు వాటికి నకిలీ పట్టాలు సృష్టిస్తున్నాడు. అప్పటి తహసీల్దార్ సంతకాలను ఫోర్జరీ చేసి అమాయకులకు అమ్మేస్తున్నాడు. అసలు లబ్ధిదారులు అక్కడికి వచ్చి తమ ప్లాట్లను కబ్జా చేశారని రెవెన్యూ అధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోలేదు.

పామిడి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పేదలకు కేటాయించిన ప్లాట్లను ఓ వైసీపీ నాయకుడు ఇష్టారాజ్యంగా అమ్మి సొమ్ము చేసుకుంటున్నాడు. రూ.10వేలు ఇచ్చుకో.. పట్టా పుచ్చుకో.. అంటూ కొత్తదందాకు శ్రీకారం చుట్టాడు. రెవెన్యూ శాఖలోని కిందిస్థాయి సిబ్బంది సహకారంతో ఓ రిటైర్డ్ తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి ఇష్టారాజ్యంగా కరపత్రాలు పంచినట్లు ఇంటి పట్టాలు పంచేస్తున్నాడు. ప్రభుత్వ స్థలాలతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. నకిలీ పట్టాలతో నిరుపేదల స్థలాలను దర్జాగా కబ్జా చేస్తున్నారు. ఆక్రమించిన స్థలాలను అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నాడు. వైసీపీ నాయకుడు, అతడి అనుచరుల వ్యవహారంపై ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. పట్టణంలోని 44వ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న చైతన్య కాలనీ, వెంగమనాయుడు కాలనీలలో నిరుపేదలకు రెవెన్యూ అధికారులు నివేశన స్థలాలను మంజూరు చేశారు. ఆ స్థలాలను కొందరు ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. నకిలీ పట్టాలు సృష్టించి నిరుపేదలకు తెలియకుండానే ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో పనిచేసి బదిలీ అయిన ఇద్దరు వీఆర్వోలు ఆక్రమణదారులకు అండగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యమేమిటనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది వైసీపీ నాయకుడికి, అతడి అనుచర గణానికి కాసుల వర్షం కురిపిస్తోంది.



బోగస్ పట్టా

కబ్జా చేసి.. అమ్మేశారు

వెంగమనాయుడు కాలనీలో చాలా ప్లాట్లను కబ్జా చేసి అమ్మేశారు. సర్వేనెంబర్ 429/3లో నాకు 145వ ప్లాటు కేటాయించి పట్టా ఇచ్చారు. నా ప్లాటుకు నకిలీ పట్టా సృష్టించి విక్రయించేశారు. ఆక్రమణదారుడికి ఓ మాజీ వీఆర్వో అండదండలు ఉన్నాయి. అప్పట్లో ఆర్థిక స్థోమత లేకపోవడంతో పాటు కుటుంబ సభ్యులకు ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో ఇళ్లు నిర్మించుకోలేకపోయా. ఈ స్థలం మాదని అన్ని ఆధారాలతో రెవెన్యూ అధికారుల వద్ద ఎంత మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథులే లేరు.



\- బొమ్మా మోహన్‌కృష్ణ, బాధితుడు, పామిడి

ఖాళీగా కనిపిస్తే కబ్జానే..

చైతన్య కాలనీ, వెంగమనాయుడు కాలనీలలో ఖాళీగా కనిపించే స్థలాలను దర్జాగా కబ్జా చేసేస్తున్నారు. ఆగమేఘాల మీద నకిలీ పట్టా సృష్టించి తమదేనంటూ అమ్మేస్తున్నారు. వైసీపీ నాయకుడు విశ్రాంత తహసీల్దార్ సంతకం ఫోర్జరీ చేసి నకిలీ పట్టాలను సృష్టించి రూ. 10వేలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. ఒకే ప్లాటును ఇద్దరు వ్యక్తులకు వేరు వేరుగా విక్రయించి సొమ్ము చేసుకున్న ఘటనలు ఉన్నాయి. ఈ కాలనీలలో కొన్నేళ్ల క్రితం నిరుపేద కుటుంబాలకు మంజూరు చేసిన నివేశన స్థలాలు ఖాళీగా ఉన్నాయి. గతంలో రెవెన్యూ అధికారులు ఏయే ప్లాటు ఖాళీగా ఉన్నాయో సర్వే చేపట్టి జాబితా తయారు చేశారు. ఆ జాబితా కొందరు ఆక్రమణదారుల చేతికి చేరింది. దీంతో ఏయే ప్లాటు ఖాళీగా ఉందో తెలుసుకొని వైసీపీ హయాంలో కొందరు రాజకీయ అండదండలతో ఆక్రమించుకొని నకిలీ పట్టాలతో అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో రెవెన్యూ అధికారులు ఇచ్చిన పట్టాలను రద్దు పరచకుండానే ఇతరులకు పట్టాలిస్తున్నారని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని వాపోతున్నారు.

ఆక్రమణలకు పాల్పడితే క్రిమినల్ కేసులు

పామిడి పట్టణంలోని నిరుపేదలకు ప్రభుత్వం ఇచ్చిన నివేశన స్థలాలను, వాగులు, వంకలను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. ప్రభుత్వ స్థలాల క్రమ విక్రయాలు చట్టవిరుద్ధం. అలాంటి వాటికి ఎలాంటి పత్రాలు జారీ చేయబోం. ఆక్రమణదారులకు అండగా నిలిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదు. బాధితులకు న్యాయం చేకూరేలా తగిన చర్యలు తీసుకుంటాం.



\-శ్రీధరమూర్తి, తహసీల్దార్, పామిడి

కూటమి వైపు ఆ నేత చూపు

ఇటీవల వైసీపీ నాయకుడి అక్రమాలు ఒకటొకటిగా బయటపడుతుండడంతో భయం పట్టుకుంది. నిరుపేదల ప్లాట్ల కబ్జా, నకిలీ పట్టాల వ్యవహారం తెలిసిపోయింది. ఇప్పుడు ఆ వైసీపీ నాయకుడితో పాటు అనుచరుల చూపు టీడీపీ వైపు మళ్లింది. ఎలాగైనా టీడీపీ గూటికి చేరాలని పావులు కదుపుతున్నారు. ఇప్పటికే కొందరు ఎన్డీయే కూటమిలో చేరిపోయారన్న ఆరోపణలు ఉన్నాయి. టీడీపీలోకి చేరలేని పక్షంలో కూటమి మిత్రపక్షాలైన బీజేపీ, జనసేనలోకైనా తన అనుచర గణంతో చేరేందుకు సిద్ధంగా ఉన్నాడు. గత కొద్ది రోజులుగా నాయకులతో మంతనాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది.



అధనపు సాయం

అసంపూర్తి ఇళ్ల నిర్మాణానికి చేయూత

- బీసీ, ఎస్సీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ..75వేలు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- 21,018 మందికి ప్రయోజనం



ఇక ఇలాంటి ఇళ్లన్నీ పూర్తి కానున్నాయి

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు కట్టుకుంటున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. వైసీపీ ప్రభుత్వంలో మంజూరై వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పూర్తి చేసుకునేందుకు అదనంగా నిధులు చెల్లించేందుకు శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వం చెల్లించిన మొత్తంతో పాటు బీసీ, ఎస్సీలకు అదనంగా రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు చెల్లించేందుకు కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 4232మంది ఎస్సీ లబ్ధిదారులకు అదనంగా రూ.21కోట్లు, ఎస్టీలు 904మందికి రూ.70లక్షలు, బీసీలు 15882మందికి రూ.80కోట్లు మొత్తంగా 21018మంది లబ్ధిదారులకు రూ.102కోట్లు చెల్లించేందుకు కూటమి ప్రభుత్వం అంగీకరించింది. దీంతో లబ్ధిదారుల్లో ఆనందం నెలకొంది. గృహ నిర్మాణ వ్యయం పెరిగిన నేపథ్యంలోనే కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే...

నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే గత ప్రభుత్వంలో మంజూరై బిల్లులు చెల్లించక మధ్యలోనే నిలిపివేసిన గృహాలు మొత్తం 21018 ఉన్నాయి.

నియోజకవర్గం	ఎస్సీ	ఎస్టీ	బీసీ	మొత్తం
అనంతపురం అర్బన్	649	270	4336	5255
గుంతకల్లు	801	96	3027	3924
కళ్యాణదుర్గం	515	45	1479	2039
రాప్తాడు	446	140	1478	2064
రాయదుర్గం	231	44	1308	1583
శింగనమల	229	67	597	893
తాడిపత్రి	339	75	1050	1464
ఉరవకొండ	1022	167	2607	3796
మొత్తం	4232	904	15882	21018

పేదలకు సువర్ణావకాశం: శైలజ, హౌసింగ్ పీడీ



రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పేదలకు వరంగా మారనుంది. గత ప్రభుత్వంలో ఇళ్లు మంజూరై, బిల్లులు కాక మధ్యలో చాలా ఇళ్లు ఆగిపోయాయి. అలాంటి లబ్ధిదారులకు ఇదో సువర్ణ అవకాశం. ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహంతో ఆగిపోయిన ఇంటి నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలి. పేదలందరికీ సొంత ఇళ్లు ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

పాఠశాలల విలీనం పక్కాగా చేపట్టాలి : కలెక్టర్

అనంతపురం టౌన్, మార్చి11(ఆంధ్రజ్యోతి): పాఠశాలల విలీనం పక్కాగా చేపట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో మంగళవారం విద్యాశాఖ అధికారులు, ఎంఈఓలతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. గతంలో 117 జీఓతో 3, 4, 5 తరగతులను హైస్కూళ్లలోకి విలీనం చేశారన్నారు. ప్రస్తుతం ఆ జీఓను రద్దుచేసి, తిరిగి ఆ పిల్లలను వెనక్కి తీసుకురావాలన్నారు. వారు కోరుకున్న పాఠశాలకే పంపాలన్నారు. మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రైమరీ స్కూళ్లను కలిపి మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేస్తారన్నారు. మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్నత పాఠశాలలు లేకపోతేనే యూపీ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూడాలన్నారు. విద్యార్థుల యూడైస్ ఆధారంగా టీచర్లను కేటాయించాలన్నారు. సమావేశంలో డీఈఓ ప్రసాద్‌బాబు, సమగ్రశిక్ష ఏపీసీ శైలజ, విద్య, సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ దొంగాటను ప్రజలు నమ్మరు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్



మాట్లాడుతున్న వెంకటశివుడు యాదవ్

అనంతపురం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): యువపోరు పేరుతో వైసీపీ మరో దొంగాటకు తెరతీసిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు యువత భవిష్యత్తును దెబ్బతీసి, పోరుబాట సాగిస్తే ప్రజలెవ్వరూ నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఐదేళ్లలో గుర్తుకురాని ఫీజు రీయింబర్స్‌మెంట్ జగన్‌రెడ్డికి ఇప్పుడు గుర్తొచ్చిందా అని ప్రశ్నించారు. రూ.4,271 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతిదీవెన బకాయిలు పెట్టింది జగన్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. 2014-19లో చంద్రబాబు ప్రభుత్వం 16లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తే.. జగన్ ప్రభుత్వం 9 లక్షల మందికి కుదించి, 7 లక్షల మంది విద్యార్థులకు అన్యాయం చేసిందని మండిపడ్డారు. గతంలో చంద్రబాబు 6 లక్షల మందికి నిరుద్యోగ భృతి ఇచ్చారని, జగన్ ప్రభుత్వం రద్దు చేసి యువతకు ద్రోహం చేసిందని అన్నారు. 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ, ఏటా జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ హామీపై జగన్ మాట తప్పి, మడమ తిప్పింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్‌తో యువత భవితను జగన్ నాశనం చేశారని అన్నారు. ఇప్పుడు ఉద్యోగాల కల్పవృక్షం చంద్రబాబు, యువత భవిత నారా లోకేశ్‌తోనే సాధ్యమవుతుందని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సబ్ ప్లాన్ నిధులు రూ.లక్ష కోట్లు దారి మళ్లించి, స్వయం ఉపాధి పథకాలను నీరుగార్చారని అన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీధర్ చౌదరి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ జిరాయతి గౌస్‌మొద్దీన్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గంజి నాగరాజు, జిల్లా మీడియా కార్యదర్శి కూచి హరి, కురువ సాధికార సమితి డైరెక్టర్ నారాయణస్వామి పాల్గొన్నారు.

రాయలచెరువులో భూ వివాదం

కొన్నామంటూ వచ్చిన పులివెందుల వాసులు

అడ్డుకున్న స్థానికులు.. తీవ్ర వాగ్వాదం

పోలీస్ స్టేషన్‌కు చేరిన పంచాయితీ

యాడికి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాయలచెరువులో భూ సమస్య పెద్ద వివాదానికి దారితీసింది. రాయలచెరువులోని ప్రైవేట్ ల్యాండ్‌ను తాము కొన్నామని పులివెందులకు చెందిన కొందరు వ్యక్తులు ఐదు వాహనాల్లో మంగళవారం రాయలచెరువుకు వచ్చారు. ఆ భూమిలో ఉన్న దుకాణాలను ఖాళీ చేయాలని దుకాణ యజమానులకు సూచించారు. అదే సమయంలో ఆ భూమి తమ అధీనంలో ఉందని, సర్వ హక్కులు ఉన్నాయంటూ రాయలచెరువుకు చెందిన కొందరు వ్యక్తులు ముందుకు వచ్చారు. దుకాణాలను ఖాళీ చేయించడానికి మీరెవరు అంటూ ఇరువర్గాల వారు కాసేపు వాగ్వాదానికి దిగారు. దీంతో స్థానికులు భయాందోళన చెందారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాల వారితో మాట్లాడారు. ఆధారాలతో పోలీస్‌స్టేషన్‌కు రావాలని సూచించారు. సాయంత్రం 7గంటల సమయంలో ఇరువర్గాల వారు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. పంచాయితీ ఎంతకూ తెగకపోవడంతో బుధవారం ఉదయం 10 గంటలకు మళ్లీ ఇరువర్గాల వారు పోలీస్‌స్టేషన్‌కు రావాలని పోలీసులు చెప్పి పంపినట్లు సమాచారం. భూ వివాదం గురించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



వివాదాస్పద స్థలం వద్ద గుమిగూడిన ఇరువర్గాలవారు

ఎవరి భూమి..?

రాయలచెరువులో వివాదాస్పదనమైన భూమి ఎవరిదనే చర్చ జరుగుతోంది. ఆ భూమి 1982 నుంచి తమ అధీనంలో ఉందని రాయలచెరువుకు చెందిన వారు చెబుతున్నారు. సుమారు 1.25 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ స్థలాన్ని కొనేందుకు నంద్యాల జిల్లా డోన్‌కు చెందిన ఒక వ్యాపారి వద్ద పులివెందులవారు ఆరునెలలక్రితం అగ్రిమెంట్ చేసుకున్నట్లు తెలిసింది. కోట్ల రూపాయలు విలువజేసే ఈ భూ వివాదం ఎక్కడికి దారితీస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఆవులదట్ల ఉపకాలువను వెంటనే నిర్మించాలి

అసెంబ్లీలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు



అనంతపురం/రాయదుర్గం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవాలో అంతర్భాగమైన 36సి (ఆవులదట్ల ఉపకాలువ) ప్యాకేజీ పనులు వెంటనే చేపట్టాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆయన మంగళవారం అసెంబ్లీలో మాట్లాడుతూ.. హంద్రీనీవా పనుల కోసం 2021 జూన్ 7న ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబరు 29 మేరకు రూ.6,124 కోట్ల పాలనా ఆమోదం పొందిందని అన్నారు. ఆ నిధులు అందుబాటులో ఉన్నందున తిరిగి పాలన, ఆర్థిక ఆమోదంతో పనిలేకుండా 36సి ప్యాకేజీని అందులోనే కలుపుకుని పనులు వేగంగా చేపట్టాలని కోరారు. ఆవులదట్ల ఉపకాలువ పరిధిలో 10 వేల ఎకరాలకు అదనంగా సాగునీరు అందించాల్సి ఉందని అన్నారు. సీఎం చంద్రబాబు నేమకల్లు పర్యటనలో ఇచ్చిన హామీ మేరకు అధికారులు 36సి ప్యాకేజీ పనులకు రూ.267 కోట్లతో తాజా ప్రతిపాదనలు సిద్ధం చేశారని అన్నారు. ముఖ్యమంత్రి, జలవనరుల శాఖ మంత్రి ప్రత్యేక చొరవతో హంద్రీనీవా పనులు పునఃప్రారంభించి, తమ జిల్లాకు ప్రాణం పోశారని కృతజ్ఞతలు తెలిపారు. హంద్రీనీవా కాలువ మధ్య హగరి నదిపై సిమెంట్ స్ట్రక్చర్ నిర్మాణానికి ఒకటిన్నర ఏడాది నుంచి రెండేళ్ల సమయం పట్టే అవకాశం ఉందని అన్నారు. కావున పనులు మరింత ఆలస్యం కాకుండా వెంటనే ప్రారంభించాలని కోరారు.

లైనింగ్ వేయొద్దు సార్..!

మంత్రి నిమ్మలకు రైతుల వినతి



జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, సిద్ధరాంపురం గ్రామస్థులు

అనంతపురం/ఆత్మకూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువకు లైనింగ్ వేస్తే పంటలకు నీరందక నష్టపోతామని, సమస్యను పరిష్కరించాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతతో కలిసి సిద్ధరాంపురం గ్రామస్థులు విన్నవించారు. వెలగపూడిలో మంత్రిని మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఒకప్పుడు చుక్కనీరు లేక ఇబ్బందులు పడ్డామని, హంద్రీనీవా నీరు రావడంతో చీనీ, మామిడి, అంజూర, దానిమ్మ పంటలు సాగు చేస్తున్నామని మంత్రికి వివరించారు. హంద్రీనీవా కాలువ 219 కి.మీ. నుంచి 223 కి.మీ. వరకూ తమ భూములు ఉన్నాయని తెలిపారు. ఆ 4 కి.మీ. పరిధిలో అక్కడక్కడ లైనింగ్ వేయవద్దని విన్నవించారు. అలా కుదరకపోతే అక్కడక్కడ ఖాళీగా వదిలినా భూగర్భ జలాలు పెరుగుతాయని అన్నారు. కాలువకు రెండు వైపులా లైనింగ్ వేసి, ఫ్లోరింగ్ వేయకుండా వదిలేసినా తమ సమస్య పరిష్కారమౌతుందని అన్నారు. రంగంపేట నుంచి తూముచెర్ల వరకూ ఉన్న రహదారిపై కాలువలో నీరు ఉంటే రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, కాలువపై వంతెన నిర్మించాలని కోరారు. అధికారులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసినవారిలో టీడీపీ కనగానపల్లి మండల కన్వీనర్ యాతం పోతులయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి సుధాకర్ చౌదరి, సర్పంచ్ సోమర చంద్రశేఖర్, హిందూపురం పార్లమెంటు అధికార ప్రతినిధి శశాంక చౌదరి తదితరులు ఉన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య




కేశవనాయుడు (ఫైల్)

అనంతపురం రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రూరల్ మండల పరిధిలోని సజ్జలకాలువ గ్రామానికి చెందిన రైతు అల్లు కేశవనాయుడు(60) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారు. సొంత పొలం ఐదు ఎకరాలకు తోడు ఎనిమిది ఎకరాలను కౌలుకు తీసుకుని టమోటా, దోస, కళింగర తదితర పంటలను సాగు చేసి నష్టపోయాడు. బ్యాంకు, ప్రైవేటు వ్యక్తుల వద్ద పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు రూ.25 లక్షలు పేరుకుపోయాయి. గ్రామ సమీపంలోని సంతోష్ నగర్‌లోని ఓ అద్దె ఇంట్లో ఆయన కుటుంబంతో ఉంటున్నారు. అప్పులవారు ఇటీవల ఇంటి వద్దకు వచ్చి ఒత్తిడి చేయడం ప్రారంభించారు. దీంతో అవమానంగా భావించి, గ్రామంలోని సొంత ఇంటికి సోమవారం రాత్రి వెళ్లిన ఆయన ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుమారుడు బాలాజీ గ్రామస్థులకు ఫోన్ చేసి, తమ ఇంట్లో గమనించాలని కోరారు. గ్రామస్థులు వెళ్లి చూసేసరికి ఆయన ఇంట్లో డ్రిప్ వైరుతో ఉరి వేసుకుని కనిపించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు గ్రామానికి వెళ్లి కన్నీరు మున్నీరుగా విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

886 మంది గైర్హాజరు

అనంతపురం విద్య, మార్చి 11(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫిజికల్ సైన్స్, ఎకనామిక్స్ పరీక్షలకు 886 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 24,878 మందికిగాను 24,137 మంది పరీక్ష రాశారు. 741 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ 2,445 మందికిగాను 2,300 మంది పరీక్ష రాయగా.. 145మంది గైర్హాజరయ్యారు. నాలుగు పరీక్షాకేంద్రాలను పరీక్షల నిర్వహణ కమిటీ కన్వీనర్, డీవీఈఓ వెంకటరమణ నాయక్, సిట్టింగ్ స్క్వాడ్ పదింటిని, ఫ్లయింగ్ స్క్వాడ్ 14 తనిఖీ చేశారు.



ఇఫ్తార్	సెహరీ
6.31	5.12
బుధవారం సాయంత్రం	గురువారం ఉదయం



ఉష్ణోగ్రతలు

మంగళవారం

గరిష్ఠం	36.0
కనిష్ఠం	20.0

గ్రానైట్‌కు గడ్డుకాలం

80% ఫ్యాక్టరీల మూత

గ్రానైట్ పరిశ్రమకు రాష్ట్రంలోనే చీమకుర్తి తర్వాత ప్రసిద్ధిగాంచినది తాడిపత్రి. దశాబ్దాలుగా గ్రానైట్, నల్లబండల ఫ్యాక్టరీలతో కళకళలాడిన ఈ ప్రాంతం వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వెలవెలబోయింది. ఏకంగా 80 శాతం పరిశ్రమలు మూతపడ్డాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒకప్పుడు ఇతర రాష్ట్రాల నుంచి సైతం వేలాది మంది కార్మికులు ఉపాధి కోసం ఇక్కడికి వలస వచ్చారు. నేడు ఇక్కడి కార్మికులే ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్న దయనీయ పరిస్థితులు దాపురించాయి.

- స్వస్థలాలకు వెళ్లిపోయిన కార్మికులు
- వైసీపీ హయాంలో పెరిగిన రాయల్టీ, విద్యుత్ చార్జీలు
- కూటమి ప్రభుత్వంలోనూ అదే పరిస్థితి
- మూతపడ్డ పరిశ్రమల్లో గొర్రెల పెంపకం, కట్టెల డిపోలు


మూతపడ్డ గ్రానైట్ పరిశ్రమ


మిషన్లను తీసివేయడంలో ఖాళీగా గ్రానైట్ పరిశ్రమ


గొర్రెల షెడ్డుగా మారిన మూసివేసిన పరిశ్రమ

తాడిపత్రి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఎందరికో ఉపాధి కల్పించిన గ్రానైట్ పరిశ్రమ నేడు కుదేలయింది. తాడిపత్రి పరిసరాల చుట్టూ గ్రానైట్, కడపస్లాబ్ ఫ్యాక్టరీలు విస్తారంగా వ్యాపించి ఉన్నాయి. వీటిలో వివిధ స్థాయిలో పనులు చేసుకుంటూ వేలాదిమంది ఉపాధి పొందేవారు. గత టీడీపీ ప్రభుత్వంలో గ్రానైట్ పరిశ్రమ బాగానే ఉంది. 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పరిశ్రమల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఏడాదికేడాది విద్యుత్ చార్జీలు, రాయల్టీ, మైనింగ్ కంపెనీలను ప్రైవేట్ పరం చేయడం తదితర కారణాలతో పరిశ్రమలు కుదలేయ్యాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కూడా అదే పద్ధతినే కొనసాగిస్తుండడంతో పరిశ్రమ యజమానులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గత ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడంతో రాయల్టీలు పెరగడం, విద్యుత్ భారంతో పరిశ్రమలు దివాలా తీశాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో అదే పద్ధతిలోనే కొనసాగుతడడంతో గ్రానైట్ పరిశ్రమల యజమానులకు మింగుడుపడడం లేదు.

80 శాతం మూత

తాడిపత్రి ప్రాంతంలో గతంలో దాదాపు గ్రానైట్ ఫ్యాక్టరీలు 650, కడపస్లాబ్ ఫ్యాక్టరీలు 1800 ఉండేవి. ప్రస్తుతం గ్రానైట్ ఫ్యాక్టరీలు 100, కడపస్లాబ్ ఫ్యాక్టరీలు 450 మాత్రమే ఉన్నాయి. నానాటికి పన్నుల పోటుతో ఫ్యాక్టరీలు మూతపడుతున్నాయి. గతంలో విద్యుత్ చార్జీలు, రాయల్టీలు తక్కువగా ఉండేవి. వైసీపీ ప్రభుత్వంలో పన్నులు రెట్టింపు కావడంతో 80 శాతం మేర పరిశ్రమలు మూతబడ్డాయి. కరెంట్ బిల్లులు కట్టలేక చాలామంది నిర్వాహకులు గ్రానైట్, నల్లబండల ఫ్యాక్టరీలను అమ్ముకున్నారు. గతంలో రాయల్టీ మీటరుకు రూ.2,500 ఉండగా.. ప్రస్తుతం రూ.5,600 ఉంది. వీటికి తోడు మైనింగ్ అధికారులు చెక్‌పోస్టులు పెట్టడంతో నిర్వహణ కష్టంగా మారింది. వీటిలో ఒక్కొక్క లారీకి రూ.9వేల నుంచి రూ.15వేల చొప్పున వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో ముడిసరుకు రవాణా చేయాలంటే టన్నుకు రూ.800 ఉండేది. ప్రస్తుతం రూ.1300కు పెరిగింది. గతంలో ఒక పరిశ్రమకు విద్యుత్ బిల్లు నెలకు రూ.80వేల వరకు వచ్చేది. ఇప్పుడు లక్షన్నర వరకు బిల్లులు వస్తుండడంతో ఆదాయం లేక బిల్లులు కట్టలేక పరిశ్రమల యజమానులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

రెండు ఫ్యాక్టరీలను మూసేశా

గతంలో నాలుగు ఫ్యాక్టరీలను నిర్వహించేవాడిని. ప్రస్తుతం పన్నులు, విద్యుత్‌బిల్లుల భారంతో రెండు ఫ్యాక్టరీలను మూసివేసి రెండింటిని మాత్రమే నిర్వహిస్తున్నాను. రెండేళ్ల క్రితం పన్నులపోటు వల్ల సుమారు రూ.10లక్షల వరకు అప్పులు కావడంతో రెండు పరిశ్రమలను మూసివేయాల్సి వచ్చింది. పన్నులు ఇలాగే కొనసాగితే మిగతా రెండు కూడా మూసివేయాల్సి వస్తుంది. ప్రభుత్వం పునరాలోచించి నిర్ణయం తీసుకుంటే పరిశ్రమల మనుగడ కొనసాగుతుంది.



-నబీరసూల్, గ్రానైట్ ఫ్యాక్టరీ యజమాని

గొర్రెల షెడ్లుగా పరిశ్రమలు

పన్నులపోటు భరించలేక గ్రానైట్, కడపస్లాబ్ ఫ్యాక్టరీలను కొందరు యజమానులు గొర్రెల షెడ్లుగా లీజుకు ఇస్తున్నారు. మరి కొందరు చెక్కకోత మిషన్లకు, డిపోలకు బాడుగకు ఇస్తున్నారు. మూతపడ్డ పరిశ్రమల్లోని మిషనరీని గుజరీకి వేసిన సందర్భాలు ఉన్నాయి. అప్పులు పెరిగిపోవడంతో ఫ్యాక్టరీలను అమ్ముకుంటున్నారు. మరికొన్నిచోట్ల ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఫ్యాక్టరీలను పడగొట్టి ప్లాట్లు వేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఫ్యాక్టరీలు మూతపడడంతో చాలామంది కార్మికులు రోడ్డునపడుతున్నారు. ఉపాధి దొరకక ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారు.

వైసీపీ హయాంలో పన్నుల పోటు



2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పన్నుల భారం ఎక్కువయింది. ఏడాదికేడాది ముడిసరుకుల ధరలు పెరగడం, విద్యుత్ చార్జీలు పెరగడంతో నిర్వహణ కష్టమయింది. వ్యాపారాలు లేక, బిల్లులు చెల్లించలేక చాలామంది ఫ్యాక్టరీలను మూసివేశారు. పన్నుల భారంతోపాటు ప్రైవేట్ చెక్‌పోస్టులు ఎక్కువయ్యాయి. కొత్త ప్రభుత్వంలోనైనా పన్నుల భారం తగ్గించి మాకు న్యాయం చేయాలి.

-శంకర్‌నాయుడు, నల్లబండల ఫ్యాక్టరీ యజమాని

సొంత రాష్ట్రాలకు వెళ్లిన కార్మికులు

తాడిపత్రి ప్రాంతంలోని పరిశ్రమల్లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు ఎక్కువగా ఉన్నారు. వేలాది మంది కార్మికులు బీహార్, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్, అస్సాం, ఒడిషా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి వచ్చారు. ఏళ్ల క్రితం వచ్చి ఇక్కడే జీవనోపాధి పొందుతున్నారు. ప్రస్తుతం ఫ్యాక్టరీలు మూతపడుతుండడంతో ఉపాధి లేక సొంత రాష్ట్రాలకు తిరిగి వెళుతున్నారు. యజమానులు చేసేదిలేక కూలీలను వెనక్కి పంపిస్తున్నారు.

కుటుంబ సభ్యులు వెళ్లిపోయారు




గ్రానైట్, కడపస్లాబ్ పరిశ్రమలు మూసివేస్తుండడంతో మా కుటుంబసభ్యులు చాలా మంది సొంత ఊరికి వెళ్లారు. నేను ఒక్కడినే ఇక్కడ ఉంటూ బండలపాలిష్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నా. ఈ పని కూడా ఎన్నాళ్లు ఉంటుందో తెలియకుండా ఉంది. సొంత ఊళ్లో పనులు లేక ఇక్కడికి వస్తే ఇక్కడ కూడా ఇదే పరిస్థితులు నెలకొన్నాయి.

- శ్రీరాములునాయక్, వలసకూలీ, కళ్యాణదుర్గం

మేనమామ మోసం...!

పేద విద్యార్థినులకు శాపం

- టీడీపీ హయాంలో ఎంజేబీ నిర్మాణం ప్రారంభం
- సగం మేర పనులు పూర్తి
- వైసీపీ పాలనలో అటకెక్కిన వైనం
- పైసా కూడా బిల్లులు చెల్లించని దుస్థితి
- రేకుల షెడ్డులో బాలికల అవస్థలు


మొండిగోడలతో ఎంజేబీ పాఠశాల భవనం


గుమ్మఘట్టలో రేకుల షెడ్డులో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాల

గుమ్మఘట్ట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు తాను మేనమామనని ప్రకటించుకున్న మాజీ సీఎం జగన్.. క్షేత్రస్థాయిలో వారికి తీవ్ర అన్యాయం చేశారు. అత్యంత వెనుకబడిన రాయదుర్గం ప్రాంతంలో బాలికా విద్యను పెంపొందించేందుకు టీడీపీ హయాంలో మండలంలోని గోనబావి గ్రామం వద్ద మహాత్మ జ్యోతిరావ్ పూలే బాలికల (ఎంజేబీ) గురుకుల విద్యాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నిధులు మంజూరు చేశారు. పనులు సగం వరకు పూర్తి చేశారు. ఈ ప్రాంత విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఎంతో సంతోషపడ్డారు. ఇంతలోనే 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రి అయిన జగన్.. విద్యకు ఎంతో ప్రాధాన్యమిస్తున్నామంటూ గొప్పలు చెప్పారు. బాలికా విద్య కోసం నిర్మిస్తున్న ఎంజేబీ విద్యాలయంపై నిర్లక్ష్యం చూపారు. పైసా కూడా నిధులివ్వలేదు. దీంతో పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. జగన్ పుణ్యమాని ఏడేళ్లుగా తాత్కాలిక రేకుల షెడ్లలో విద్యార్థినులు అవస్థలు పడుతూ చదువుకుంటున్నారు. కనీస వసతుల్లేక తిప్పలు పడుతున్నారు. కూటమి అధికారంలోకి రావడంతో పాఠశాల భవనాల పనులు మొదలు పెట్టేందుకు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత.. ఇటీవల అర్ధంతరంగా ఆగిపోయిన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. వెంటనే పనులు మొదలెట్టేలా చర్యలు చేపడుతున్నారు. సాంకేతిక సమస్యల కారణంగా పనులు జాప్యమవుతున్నట్లు తెలుస్తోంది. వీటిని పరిష్కరించి, వెంటనే భవన నిర్మాణాలు పూర్తి చేసి, వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికైనా అందుబాటులోకి తేవాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వైసీపీ పాపం..

రాయదుర్గం వెనుకబడిన ప్రాంతం. చాలామంది వలసలు వెళ్తారు. పేదరికం తదితర కారణాలతో చాలామంది పిల్లలు చదువుకు దూరమౌతున్నారు. టీడీపీ ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అప్పట్లో మంత్రిగా పనిచేసిన కాలవ శ్రీనివాసులు ఈ ప్రాంతంలో బాలికా విద్యను ప్రోత్సహించేందుకు గురుకుల పాఠశాల అవసరమని భావించారు. పాఠశాల నిర్మాణానికి ఉపక్రమించారు. గుమ్మఘట్ట మండలం గోనబావి గ్రామ సమీపాన రూ.24 కోట్లతో 2016లో విద్యాలయ భవనాల నిర్మాణం చేపట్టారు. రెండేళ్లపాటు రూ.12 కోట్ల మేర పనులు పూర్తయ్యాయి. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో పనులకు గ్రహణం పట్టింది. పైసా కూడా బిల్లులు చెల్లించలేదు. దీంతో కాంట్రాక్టర్ పనులను అర్ధాంతరంగా ఆపేశారు. అప్పట్నుంచి ఏడేళ్లుగా ఆ భవనాలు దిష్టిబొమ్మలా కనిపిస్తున్నాయి. విద్యాలయాన్ని తాత్కాలికంగా గుమ్మఘట్టలోని సొసైటీ షెడ్లలో నిర్వహిస్తున్నారు. ఐదు నుంచి పదో తరగతి వరకు 400 మంది దాకా విద్యార్థినులు చదువుకుంటున్నారు. తాత్కాలిక షెడ్లలో కనీస వసతుల్లేక విద్యార్థినులు ఏడేళ్లుగా నరక యాతన అనుభవిస్తున్నారు.

నిధులు పెంచి..

గతేడాది కూటమి అధికారంలోకి రావడంతో ఎంజేబీ విద్యాలయ నిర్మాణంపై ఆశలు రేగాయి. ఆ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఇటీవల అర్ధంతరంగా ఆగిపోయిన భవన నిర్మాణాన్ని పరిశీలించారు. మరో రూ.8 కోట్ల మేర నిధులు పెంచి, పనులు ప్రారంభిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఆ మేరకు నిధులు మంజూరు చేశారు. పనులు మొదలవాల్సి ఉంది. మూడునెలలుగా పనులు ముందుకు కదలడం లేదు. విద్యా సంవత్సరం దగ్గర పడుతుండడంతో విద్యార్థినుల తల్లిదండ్రుల్లో టెన్షన్ మొదలైంది. పాఠశాల పునఃప్రారంభం నాటికి పనులు మొదలవుతాయా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. టెండర్ల ప్రక్రియలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నట్లు తెలుస్తోంది. వాటిని పరిష్కరించి, వెంటనే పనులు మొదలయ్యేలా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవ చూపాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పూర్తి చేయాలి

వచ్చే విద్యా సంవత్సరం నాటికైనా పాఠశాల భవనాలు పూర్తి చేయాలి. మూడునెలల క్రితం మంత్రి సవిత హామీ ఇచ్చి వెళ్లారు. అధికారులు పనులు ప్రారంభించడంలో జాప్యం చేస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. వెంటనే పనులు ప్రారంభించాలి.



- రవి, విద్యార్థిని తండ్రి, గోనబావి

పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం

గతంలో గురుకుల భవన నిర్మాణ టెండర్ దక్కించుకున్న హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టు సంస్థకు పనులు ప్రారంభించాలని నోటీసులు జారీ చేశాం. సంబంధిత కాంట్రాక్టు సంస్థ నుంచి సమాధానం రాలేదు. ఆ సంస్థ ప్రారంభించకపోతే ప్రత్యామ్నాయ చర్యలు చేపడతాం.

-శివకుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

'మొల్లమాంబ జయంతిని విజయవంతం చేయండి'

అనంతపురం ప్రెస్ క్లబ్, మార్చి11(ఆంధ్రజ్యోతి): తొలి తెలుగు మహిళా కవయిత్రి, రామాయణ రచయిత మొల్లమాంబ జయంతిని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూకొఠారీ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 13వతేదీన ఉదయం 10.30 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని రెవెన్యూ భవన్‌లో మొల్లమాంబ జయంతి వేడుకలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, కుల సంఘాల నాయకులు హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

సేంద్రియ చైతన్యం

పెరుగుతున్న సాగు విస్తీర్ణం

రెండు వేల హెక్టార్లకు పైబడి సాగు

కళ్యాణదుర్గం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పంట పెట్టుబడి ఖర్చులు తగ్గించుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. సేంద్రియ సాగుకు మొగ్గు చూపుతున్నారు. పొలాలకు పేడ ఎరువులు వేస్తున్నారు. దీంతో సేంద్రియ ఎరువులకు డిమాండ్ పెరుగుతోంది. రసాయన ఎరువులకు స్వస్తి పలుకుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఎక్కువగా సేంద్రియ ఎరువులను ఉపయోగించుకునేందుకు సిద్ధమవుతున్నారు. రసాయన ఎరువుల వినియోగంతో తలెత్తుతున్న అనర్థాలపై రైతుల్లో చైతన్యం వచ్చింది. భూసారాన్ని పెంపొందించుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. పశువుల పేడ, మేక, గొర్రెల ఎరువులను పొలాలకు తోలుతున్నారు. పశువులు లేని రైతులు పేడ ఎరువు కొనుగోలు చేసి మరీ.. పొలాల్లో వేసుకుంటున్నారు.


చేనులో తోలిన పేడ ఎరువు

సేంద్రియ ఎరువులతో మంచి దిగుబడులు



కర్బూజా, కళింగర పంటల సాగుకు సేంద్రియ ఎరువులు ఉపయోగిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు. ఈ పంటలకు ఎటువంటి తెగుళ్లు సోకకుండా సేంద్రియ ఎరువులు బాగా ఉపయోగపడతాయి. పేడ ఎరువుకు మంచి డిమాండ్ ఉంది. పశువుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో సేంద్రియ ఎరువు ఆయా ప్రాంతాల్లో మంచి రేటు పలుకుతోంది.

- హరీష్, రైతు, కరిగానిపల్లి, కుందుర్పి మండలం

ఖరీఫ్ కింద ఏటా నియోజకవర్గ వ్యాప్తంగా రెండు వేల హెక్టార్లకు పైబడి వేరుశనగ సాగు చేస్తున్నారు. అంతర పంటలు కూడా వేసుకుంటారు. పంటలకు సేంద్రియ ఎరువులను ఉపయోగించాలన్న ఆలోచనలో రైతులు ఉన్నారు. కర్బూజా, కళింగర, టమోటా, బొప్పాయి, మిర్చి, బీర పంటలకు కూడా సేంద్రియ ఎరువులను ఉపయోగిస్తున్నారు. తద్వారా పెట్టుబడులు తగ్గడమే కాకుండా పంట దిగుబడులు ఆశాజనకంగా వస్తాయని రైతులు అంటున్నారు. కొనుగోలు చేసిన సేంద్రియ ఎరువును రైతులు.. ఎండ్లబండ్లు, ట్రాక్టర్ల ద్వారా తోలుకునే పనిలో నిమగ్నమయ్యారు. రసాయన ఎరువుల ధరలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. వాటి కోసం రైతులు అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. వెరసి పెట్టుబడి పెరిగిపోతోంది. రసాయన ఎరువుల వాడకం వల్ల పంటలకు చీడపీడలు సోకి పంట దిగుబడి తగ్గిపోతోంది. దీంతో రసాయన ఎరువుల వినియోగానికి రైతులు వెనకడుగు వేస్తున్నారు.

రసాయన ఎరువులకు స్వస్తి
పంటలకు పేడ ఎరువుల వినియోగం

తగ్గనున్న ఖర్చు



రసాయన ఎరువుల వాడకం కారణంగా భూమి గట్టి పడుతోంది. పంటలకు తెగులు అధికంగా సోకుతున్నాయి. పశువుల పేడ వాడకంతో భూమి గుల్ల బారి ఎక్కువ కాలం సత్తువ ఉంటోంది. రోగాలు కూడా తక్కువే. దిగుబడులు ఆశాజనకంగా వస్తున్నాయి. దీంతో ఏటా పశువుల ఎరువునే వాడుతా.

- రామాంజనేయులు, రైతు, కరిగానిపల్లి

లాభాలు అనేకం..

సేంద్రియ ఎరువు వాడకం ద్వారా రైతుకు అనేక లాభాలు చేకూరుతాయి. పశువుల పేడ చెత్తతో కూడిన సేంద్రియ ఎరువు వేస్తే పొలాల్లో ఎక్కువ కాలం భూమిలో తేమ ఉంటుంది. దీంతో చీడపురుగులు నశిస్తాయి. తెగుళ్ల కూడా తక్కువే. రైతుకు ఖర్చు తగ్గి, అధిక ఫలసాయం లభిస్తుంది.

- ఎల్లప్ప, ఏడీఏ, కళ్యాణదుర్గం డివిజన్

డ్వామాలో బదిలీల ఫీవర్

- ఉమ్మడి జిల్లా యూనిట్‌గా నిర్వహణకు కసరత్తు
- తాజాగా ఏపీడీల బదిలీలతో మొదలైన చిచ్చు
- చక్రం తిప్పుతున్న హెచ్‌ఆర్ విభాగ ఉద్యోగులు



అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): డ్వామాకు బదిలీల ఫీవర్ పట్టుకుంది. గత ఏడాది సెప్టెంబరులో ఉద్యోగుల బదిలీలు చేపట్టినా.. డ్వామా నుంచి ఎవ్వరినీ కదిలించలేదు. ప్రభుత్వం అనుమతివ్వలేదు. దీంతో డ్వామాలో ఉద్యోగుల బదిలీలు త్వరలో ఉండొచ్చని తాజా సమాచారం. ఈ నేపథ్యంలో ఇటీవల ఇద్దరు ఏపీడీల బదిలీతో ఉద్యోగుల్లో చిచ్చు మొదలైంది. ఉమ్మడి జిల్లాలో అనంతపురం, కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ, గుత్తి, తాడిపత్రి, కదిరి, హిందూపురం, ధర్మవరం, మడకశిర, ఓడీసీ, పుట్టపర్తి క్లస్టర్లున్నాయి. తాజాగా గుత్తి, తాడిపత్రి ఏపీడీలను బదిలీ చేయడం పట్ల డ్వామా ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు ఆరు క్లస్టర్లకు ఏపీఓలు.. ఇన్‌చార్జి ఏపీడీలుగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలోనే ఏళ్లుగా పనిచేస్తున్న ఏపీడీలను కోరుకున్న స్థానానికి బదిలీ చేయడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో డ్వామాలో ఉమ్మడి జిల్లా యూనిట్‌గా ఏపీఓ, ఈసీ, టీఏ, కంప్యూటర్ ఆపరేటర్ల బదిలీలు చేపట్టేందుకు సీఆర్‌డీ నుంచి సూచనప్రాయంగా అనుమతి లభించినట్లు సమాచారం. త్వరలో ఉద్యోగుల బదిలీలు చేపట్టే అవకాశం ఉంది. బదిలీల్లో కీలకంగా ఉన్న హెచ్‌ఆర్ విభాగంలో గత వైసీపీ ప్రభుత్వంలో హవా సాగించిన ఉద్యోగులే ఉండడం గమనార్హం. గత వైసీపీ హయాంలో ఐదేళ్లపాటు ఉన్న హెచ్‌ఆర్ విభాగ ఉద్యోగులు బదిలీల్లో తమకు అనుకూలంగా ఉండే వారికే ప్రాధాన్యమిచ్చే అవకాశం ఉందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ముందుగా హెచ్‌ఆర్ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు స్థానచలనం కల్పించి, తరువాత బదిలీలు చేపట్టాలని డ్వామా ఉద్యోగులు కోరుతున్నారు. డ్వామాలో వాటర్‌షెడ్ ఏపీడీ కూడా ఏడేళ్లుగా ఒకే స్థానంలో కొనసాగుతున్నారు. వాటర్‌షెడ్ పీఓలను కూడా బదిలీ చేస్తారా.. వారినే కొనసాగిస్తారా అనేది స్పష్టత రావాల్సి ఉంది.

చక్రం తిప్పుతున్న హెచ్‌ఆర్ విభాగం

డ్వామాలో బదిలీలకు సంబంధించి ఉమ్మడి జిల్లా యూనిట్‌గా చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇందులో హెచ్‌ఆర్ విభాగమే కీలకం. ఉమ్మడి జిల్లా యూనిట్‌గా 63 మండలాల్లో పనిచేస్తున్న ఏపీఓ, ఈసీ, టీఏ, కంప్యూటర్ ఆపరేటర్ల బదిలీల చేపట్టనున్నారు. ఏడేళ్లుగా హెచ్‌ఆర్‌లో పాతుకుపోయిన ఉద్యోగులే బదిలీలు చేపడుతుండడంతో అర్హులకు అన్యాయం వాటిల్లే అవకాశం ఉందన్న ఆందోళన ఉద్యోగుల్లో నెలకొంది. మొదట హెచ్‌ఆర్ విభాగంలో పనిచేసే వారికి స్థానచలనం కల్పించాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్, డ్వామా పీడీల వద్ద చర్చకు వచ్చినట్లు సమాచారం.

బదిలీలు ఉండొచ్చు..

ఉద్యోగుల బదిలీలు ఉండొచ్చని సీఆర్‌డీ ఉన్నతాధికారుల నుంచి సమాచారం అందింది. ఉమ్మడి జిల్లా యూనిట్‌గా ఏపీఓ, టీఏ, ఈసీ, కంప్యూటర్ ఆపరేటర్ల బదిలీలు చేపట్టాలని నిబంధన ఉంది. ఉద్యోగుల బదిలీలకు సంబంధించి పూర్తిస్థాయిలో నియమ, నిబంధనలు రావాల్సి ఉంది. దీర్ఘకాలికంగా ఒకేచోట పనిచేస్తున్న వారికి కచ్చితంగా స్థానచలనం ఉంటుంది. బదిలీల్లో ఏ ఒక్క ఉద్యోగికి అన్యాయం వాటిల్లకుండా చూస్తాం. సీనియార్టీ ప్రకారం ఉద్యోగుల వివరాలను సిద్ధం చేయాలని సూచించాం.

-సలీంబాషా, డ్వామా పీడీ



డ్వామా కార్యాలయం

డ్యాన్స్ చేస్తూ యువకుడి మృతి


ముస్తాఫా (ఫైల్)

యాడికి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి సరదాగా డ్యాన్స్ చేస్తూ ఉన్నట్లుండి ముస్తాఫా (18) అనే యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన సోమవారం రాత్రి యాడికిలో జరిగింది. యాడికిలోని పిన్నేపల్లిరోడ్డు లేఔట్‌లో నివాసం ఉంటున్న మహబ్బీ, దస్తగిరి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. దస్తగిరి నాలుగేళ్లక్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. పెద్ద కుమార్తె రేష్మాకు వివాహం చేశారు. చిన్న కుమార్తె రజియా దివ్యాంగురాలు. కుమారుడు ముస్తాఫా చేనేత కార్మికుడిగా పని చేస్తున్నాడు. తల్లి మహబ్బీ కూలీ పనులకు వెళుతోంది. యాడికిలో చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతుండడంతో సోమవారం రాత్రి ముస్తాఫా స్నేహితులతో కలిసి స్వామి వాహనసేవ ముందు డ్యాన్స్‌వేస్తూ ఉన్నట్లుండి కుప్పకూలాడు. చికిత్స నిమిత్తం స్నేహితులు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ముస్తాఫా మృతి చెందినట్లు తెలిపారు.

మత్తుపదార్థాలు తీసుకోవడమే కారణమా..?

ముస్తాఫా సోమవారం రాత్రి కల్లులోకి కొన్ని మత్తుపదార్థాల్ని కలిపి సేవించినట్లు అతడి స్నేహితులు తెలిపారు. ఆ పదార్థాలను తీసుకోవడం వల్లే మృతి చెందినట్లు తెలుస్తోంది. యాడికిలోని కల్లు దుకాణాలన్నింటిలో యువకులు మత్తుపదార్థాల్ని వేయించుకొని తాగుతున్నారని చర్చించుకుంటున్నారు. కల్లు దుకాణాల్లో మత్తుపదార్థాలు వాడకుండా అధికారులు తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పగలే ఇంట్లో చోరీ

నాలుగు కేజీల వెండి అపహరణ


చెల్లాచెదురుగా పడిన బీరువాలోని వస్తువులు

నార్పల, మార్చి11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లక్ష్మీనగర్‌లో మంగళవారం బంగారు దుకాణం యజమాని ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వెంకటేశు అనారోగ్యానికి గురి కావడంతో ఇంటికి తాళం వేసి తన భార్యతో అనంతపురంలోని ఓ ఆసుపత్రికి చికిత్సనిమిత్తం వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని దుండుగులు ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి బీరువాలో ఉన్న నాలుగు కేజీల వెండిని అపహరించుకొని వెళ్లారు. హాస్పిటల్ నుంచి తిరిగి వచ్చిన వెంకటేశు ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించి వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సాగర్ సంఘటన స్థలాన్ని డాగ్‌స్క్వాడ్‌తో పరిశీలన చేపట్టారు. అదేవిధంగా నార్పలకు చెందిన వేణు సిమెంట్ దుకాణంలో 300 ప్యాకెట్ల సిమెంటును చోరీ చేశారు. ఈ ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య


భర్తతో అఖిల (ఫైల్)

ధర్మవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నేసేపేటలో లక్ష్మీపతి భార్య నీరుగంటి అఖిల(22) మంగళవారం మధ్యాహ్నం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. లక్ష్మీపతి, అఖిలకు రెండు సంవత్సరాలక్రితం వివాహమైంది. అఖిల పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తుండేది. వీరికి సంతానం లేదు. పెళ్లైన కొన్ని నెలలు వీరి కాపురం సాఫీగా సాగింది. ఆ తరువాత ఇద్దరి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన అఖిల మంగళవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు వన్‌టౌన్ పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలు అడిగితెలుసుకున్నారు. మృతిరాలి తల్లి కళావతి తన కుమార్తె మృతికి అల్లుడు, వారి కుటుంబసభ్యులే కారణమని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

టమోటా కిలో రూ.8

అనంతపురం రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 8తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 225 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 7, కనిష్ఠ ధర రూ. 5 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.20వేలు

అనంతపురం రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 20,720 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 3వేలు, సరాసరి రూ. 11వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు.

నేటి నుంచి సూపర్ స్పెషాలిటీలో పీడియాట్రిక్ సేవలు

అనంతపురం టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో పిడియాట్రిక్ సర్జన్‌సేవలు అందనున్నాయని సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు మంగళవారం వెల్లడించారు. డీఎంఈ ఆదేశాల మేరకు ఇక నుంచి వారానికి రెండురోజులపాటు ఓపీసేవలు కొనసాగుతాయన్నారు. ప్రతి సోమ, బుధవారాల్లో సేవలందుతాయన్నారు. నేటి నుంచి సేవలు అందించడం జరుగుతుందన్నారు.

జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శిగా భీమలింగారెడ్డి



▲ భీమ లింగారెడ్డి, మురళీ కృష్ణ ►

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): క్రికెట్ సంఘం జిల్లా కార్యదర్శిగా భీమలింగారెడ్డి నియమితులయ్యారు. సోమవారం అనంత క్రీడాగ్రామంలో నిర్వహించిన జిల్లా క్రికెట్ సంఘం సర్వసభ్య సమావేశంలో జిల్లా కార్యదర్శి, సహాయ కార్యదర్శులను ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. భీమలింగారెడ్డిని కార్యదర్శిగా, సహాయ కార్యదర్శిగా జిల్లా మాజీ క్రీడాకారుడు మురళీకృష్ణను ఎన్నుకున్నారు. ఈ ఏడాది నవంబరు వరకు ఇద్దరు ఆయా పదవుల్లో కొనసాగనున్నారు.

ప్లాట్‌ఫాం ఏడుపు.!

దెబ్బతిన్న 7వ నంబరు ప్లాట్‌ఫాం యాప్రాన్

- తరచూ విరిగిపోతున్న రైలు పట్టాలు
- రైళ్లన్నీ వేరే ప్లాట్‌ఫాంల్లోకి మళ్లింపు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు


7వ నంబరు ప్లాట్‌ఫాంలో ట్రాక్ యాప్రాన్ దెబ్బతిని వదులైపోయిన స్లీపర్లు


తెగిన రైలు పట్టాను తొలగించి మరమ్మతులు చేస్తున్న గ్యాంగ్ సిబ్బంది

గుంతకల్లు, మార్చి11(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్‌లో ఓ ప్లాట్‌ఫాం దెబ్బతినడంతో ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. రైల్వే స్టేషన్‌లోని 7వ నంబరు ప్లాట్‌ఫాంకు ఉన్న ట్రాక్ యాప్రాన్ దెబ్బ తినడంతో రైల్వే అధికారులు ఆ లైన్‌ను తక్కువగా వినియోగిస్తున్నారు. ఎప్పుడూ అత్యంత రద్దీగా ఉండే ఈ ప్లాట్‌ఫాంను రైల్వే అధికారులు వినియోగించడం తగ్గించేశారు. ఈ ప్లాట్‌ఫాంలోకి వచ్చే ప్రధాన రైళ్లన్నింటినీ సరైన వసతుల్లేని 5వ నంబరు ప్లాట్‌ఫాంలోకి పంపుతున్నారు. ఈ కారణంగా ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. 7వ నం. ప్లాట్‌ఫాంలో యాప్రాన్ ధ్వంసమైపోయిన కారణంగా రైళ్లు వచ్చినప్పుడు ట్రాక్ కిందకు కుంగిపోతోంది. దీని వల్ల ట్రాక్ పట్టాలు


ట్రాక్ యాప్రాన్ పాడైపోయిన 7వ నంబరు ప్లాట్‌ఫారం

తరచుగా విరిగి ప్రమాదకరంగా మారుతున్నాయి. దీంతో ఆ ప్లాట్‌ఫాం వినియోగాన్ని తగ్గించేశారు.

ధ్వంసమైన యాప్రాన్

ప్లాట్‌ఫాంలలో ట్రాక్‌పైన పారిశుధ్య సమస్య ఏర్పడకుండా గతంలో కమ్మీలకు బేలస్ట్ (కంకరను) వేయకుండా సిమెంటు కాంక్రీటు (యాప్రాన్)ను వేసేవారు. అలా సిమెంట్ యాప్రాన్ వేయడం వల్ల రైలు ప్లాట్‌ఫాంపై ఉన్నప్పుడు ప్రయాణికులు రైళ్లలోని టాయిలెట్లను ఉప యోగిస్తే పారిశుధ్య పనులు చేయడానికి సులభంగా ఉంటుంది. కానీ గడచిన ఏడేళ్ల కాలంలో బోగీలన్నింటిలోనూ గ్రీన్ టాయిలెట్లను అమర్చడంతో స్టేషన్లలో అపరిశుభ్రత తగ్గింది. గ్రీన్ టాయిలెట్ల కారణంగా యాప్రాన్ల నిర్మాణ కార్యక్రమానికి రైల్వే ఫుల్‌స్టాప్ పెట్టింది. ఈ నేపథ్యంలో గతంలో ప్లాట్‌ఫాంల ట్రాక్‌కు వేసిన సిమెంటు యాప్రాన్ నిర్మాణాలను సరిగా నిర్వహించని కారణంగా దెబ్బతింటున్నాయి. ఈ మేరకు ఇతర ప్లాట్‌ఫాంలతో పోలిస్తే 7వ నంబరు ప్లాట్‌ఫాంలో వేసిన యాప్రాన్ ఎక్కువగా దెబ్బతింది. దీని వల్ల సిమెంటు వదులైపోయి రైళ్ల బరువుకు అందులోని స్లీపర్లు కిందకు కుంగుతున్నాయి. ట్రాక్ కమ్మీలపై ఒత్తిడి పెరిగి విరిగిపోతున్నాయి. దీని వల్ల 7వ నంబరు ప్లాట్‌ఫాం పట్టాలను తరచుగా మరమ్మతు చేయాల్సి వస్తోంది.

వసతుల్లేని ప్లాట్‌ఫాంతో ఇబ్బందులు

దశాబ్దాలుగా గుంతకల్లు రైల్వే జంక్షన్‌లో 7వ నంబరు ప్లాట్‌ఫారానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. ప్రధాన రైళ్లన్నింటినీ 7వ నంబరు ప్లాట్‌ఫాంలోకి తెచ్చేవారు. దీని వల్ల అక్కడ ప్రయాణికుల వేచి ఉండే గదులు, ఆహారపు స్టాళ్లు, హోటళ్లు, జీఆర్పీ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేశారు. దీంతో రైళ్లు 7వ ప్లాట్‌ఫాంలోకి వస్తే ఎటువంటి ఇబ్బందులు ఉండేవి కావు. కానీ ప్రస్తుతం రైళ్లను 7కు బదులు 5వ ప్లాట్‌ఫాంలోకి తెస్తున్నారు. 5వ నంబరు ప్లాట్‌ఫాంలో కేవలం రెండు స్టాళ్లు మాత్రమే ఉన్నాయి. తక్కువసేపు స్టాపింగ్ ఉండే రైళ్లలోని ప్రయాణికులు ఆహార పదార్థాలను కొనడానికి ఇబ్బంది పడాల్సి వస్తోంది. అలాగే ప్రయాణికులు జీఆర్పీ పోలీసు స్టేషన్‌లో ఏదైనా ఫిర్యాదు ఇవ్వదలిస్తే ప్లాట్‌ఫాం దాటి 7వ ప్లాట్‌ఫాంపైకి రావాల్సి ఉంటుంది. దీనికి తోడు 6వ నంబరు ప్లాట్‌ఫాంపై రాయచూరు, కాచిగూడ ప్యాసింజరు రైళ్లను మాత్రమే నిలుపుతున్నారు. 6వ ప్లాట్‌ఫాంపైకి గతంలో వచ్చే రైళ్లను 4వ నంబరులోకి తీసుకెళ్తున్నారు. ఇక్కడ కూడా ప్రయాణికులకు సమస్యలే ఎదురవుతున్నాయి. రైళ్ల కోసం ఎదురు చేసే ప్రయాణికులకు 4-5 ప్లాట్‌ఫాంలలో వెయిటింగ్ హాళ్లు లేకపోవడం సమస్యగా మారింది. ఇదిలా ఉండగా 7వ ప్లాట్‌ఫాంలో పదుల సంఖ్యలో ఏర్పాటైన స్టాల్స్, హోటళ్ల నిర్వాహకులు వ్యాపారాలు కరువయ్యాయని వాపోతున్నారు. 7వ నంబరు ప్లాట్‌ఫాంపై ధ్వంసమైన యాప్రాన్‌కు మరమ్మతులు చేసి రైళ్లను 6-7 ప్లాట్‌ఫాంల్లోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు విద్యార్థినులు మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. కురుగుంట కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతున్న రుచిత బుద్ధిగా చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించినందుకు ఉరి వేసుకుంది. సోమందేపల్లిలోని కేజీబీవీలో పదో తరగతి చదువుతున్న పూజశ్రీ తన చావుకు ఎవరూ కారణంకాదని లేఖ రాసి ఆత్మహత్య చేసుకుంది. దీంతో బాధిత కుటుంబాలలో విషాదం అలుముకుంది.

చదువుకోవాలని మందలించినందుకు...


రుచిత మృతదేహం

అనంతపురం క్రైం/రూరల్/సోమందేపల్లి మార్చి 11(ఆంధ్రజ్యోతి): బుద్ధిగా చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించినందుకు తొమ్మితో తరగతి విద్యార్థిని రుచిత(14) ఆత్మహత్య చేసుకుంది. అనంతపురం రూరల్ ఎస్‌ఐ రాంబాబు తెలిపిన వివరాల మేరకు, కురుగుంట వైఎస్సార్ కాలనీకి చెందిన రాజేష్, మునీశ్వరి దంపతుల కూతురు రుచిత కురుగంట కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతోంది. తరగతులకు సరిగా వెళ్లేదికాదు. బాలిక తీరు కారణంగా ఇబ్బంది పడుతున్నామని కొందరు విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గతంలోనే రెండుసార్లు బాలికను ఇంటికి పంపారు. తల్లిదండ్రులు సర్దిచెప్పి వదిలి వెళ్లాక మరోసారి సమస్య తలెత్తింది. దీంతో ఇంటికి తీసుకువెళ్లాలని మంగళవారం ప్రిన్సిపాల్ సూచించారు. తల్లి మునీశ్వరి మధ్యాహ్నం పాఠశాలకు వచ్చి రుచితను ఇంటికి తీసుకెళ్లారు. ఆ కుటుంబం సమీపంలోని రాధాస్వామి సత్సంగ్ ఆశ్రమంలో ఉంటోంది. రుచితను అక్కడికి తీసుకెళ్లి చెట్లకు నీరు పట్టమని పురమాయించారు. ఆ క్రమంలోనే మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో రుచిత ఓ లేఖ రాసి, చెట్టుకు ఉరి వేసుకుంది. తాను ఓ అమ్మాయితో స్నేహంగా ఉండటంలో తప్పేమిటని లేఖలో రాసినట్లు తెలిసింది. రూరల్ ఎస్‌ఐ రాంబాబు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థిని ఆత్మహత్య నేపథ్యంలో డీఈఓ ప్రసాద్‌బాబు, కేజీబీవీల ఏపీసీ శైలజ మంగళవారం రాత్రి కేజీబీవీని పరిశీలించారు. ఘటన గురించి విద్యార్థులు, ఉపాధ్యాయులను విచారించారు. వివరాలను నమోదు చేసుకుని వెళ్లారు.

ఎవరూ కారణం కాదు..

సోమందేపల్లిలో పదోతరగతి విద్యార్థిని పూజశ్రీ (15) మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కస్తూర్బా పాఠశాలలో పదోతరగతి చదువుతున్న పూజశ్రీ ఐదు రోజుల క్రితం అనారోగ్యానికి గురైంది. ఎస్‌ఓ అనిత తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో తండ్రి సురేష్, తల్లి సుధామణి ఆ విద్యార్థినిని ఇంటికి తీసుకెళ్లారు. అయితే మంగళవారం ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడింది. తన చావుకు ఎవరూ కారణంకాదని లేఖరాసి మృతి చెందినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఆలయ సొమ్ము చోరీ.. అంతర్రాష్ట్ర దొంగల పనే..

ఇద్దరి అరెస్టు... పరారీలో మరో నిందితుడు

రూ.10.05 లక్షల నగదు, బైక్ స్వాధీనం



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రమణమూర్తి

అనంతపురం క్రైం/కణేకల్లు, మార్చి11(ఆంధ్రజ్యోతి): కణేకల్లు మండలం సొల్లాపురం గ్రామంలో వారంరోజుల క్రితం ఆలయ సొమ్ము చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో ఏఎస్పీ డీవీ రమణమూర్తి మంగళవారం వెల్లడించారు. సీతారామాంజనేయుల దేవాలయ నిర్మాణానికి గ్రామంలో చందాల రూపంలో డబ్బు పోగు చేశారు. ఇలా పోగైన డబ్బు రూ.12 లక్షలు గ్రామానికి చెందిన గుర్రం లక్ష్మన్న వద్ద ఉంచారు. ఈ నగదు ఇంట్లో ఉంచి తాళం వేసి, పనిపై లక్ష్మన్న మరో ఊరెళ్లాడు. అదును చూసి ఈనెల 3వ తేదీ అర్ధరాత్రి దాటాక ఇంటి తాళాలు పగులగొట్టి, దొంగలు లోపలికి చొరబడ్డారు. ఆలయ నిర్మాణానికి పోగు చేసిన మొత్తం రూ.12లక్షలు ఎత్తుకెళ్లారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు కణేకల్లు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

అరెస్టయిన వారు వీరే..

అన్నమయ్య జిల్లా నందలూరు మండలం నల్లతమ్మాయిపల్లికి చెందిన గురునాథం రాజు అలియాస్ గురునాథం ఏడుకొండలు. ప్రస్తుతం ఇతడు కడప జిల్లా ఒంటిమిట్ట సిద్దవటం మండలం కొత్తమాధవరంలో నివాసముంటున్నాడు. తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూర్ జిల్లా వానియంబాడి తాలూకా రాజపాలెంకు చెందిన దండిపాణి కార్తీక్‌ను అరెస్టు చేశారు. కడప జిల్లా ఒంటిమిట్ట సిద్దవటం మండలం కొత్త మాధవరం గ్రామానికి చెందిన నాగలూరి జానయ్య పరారీలో ఉన్నాడు. వారి నుంచి రూ.10.05 లక్షల నగదు, చోరీకి ఉపయోగించిన పరికరాలు, మోటర్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేసిన సొమ్ములో మిగిలిన డబ్బు రూ.1.95 లక్షలు పరారీ నిందితుడు తీసుకెళ్లినట్లు పోలీసుల విచారణలో తేలింది.

చోరీ చేశారిలా..

గురునాథం రాజు, నాగలూరి జానయ్య సమీప బంధువులు. జానయ్య వరుసకు మేనమామ అవుతాడు. వీరి తల్లిదండ్రులు పాములు పట్టుకుని ఊరూరా తిరుగుతూ వాటిని ఆడిస్తూ జీవనం సాగించేవారు. గురునాథం రాజు తమిళనాడులో బాతులు మేపుతూ జీవనం చేసేవాడు. జానయ్య ఇటుకల బట్టీలో పనిచేసేవాడు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన కార్తీక్.. గురునాథం రాజుకు బాతులు మేపే సందర్భంలో పరిచయమయ్యాడు. దీంతో ముగ్గురూ స్నేహితులుగా మారారు. ఈ క్రమంలో 20రోజుల నుంచి ముగ్గురూ మోటారు సైకిల్‌పై గ్రామాల్లో తిరుగుతూ ఊరు చివర డేరాలు వేసుకునేవారు. రెండు, మూడు రోజులుండి అక్కడ పాములు ఆడించుకుని ఊరు చివర్లో ఉన్న చిన్న గుడులు, బయట హుండీలను, అందులో డబ్బును అపహరించేవారు. ఆ తర్వాత ఆ ఊరిలో డేరాలు ఖాళీ చేసి, దూరంలో ఉండే మరో గ్రామానికి చేరుకుంటారు. ఈ క్రమంలో కర్ణాటక నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి రిజర్వాయర్‌కు దగ్గర్లో బైక్‌లో వస్తుండగా దారిలో సొల్లాపురం గ్రామంలో తాళం వేసిన ఇంటిని గమనించారు. చోరీ చేయాలని నిర్ణయించుకున్నారు. మరుసటిరోజు రాత్రి ముగ్గురూ బైక్‌లో జీడిపల్లి నుంచి బయలుదేరి సొల్లాపురం చేరుకున్నారు. అర్ధరాత్రి ఆ ఇంట్లోకి చొరబడి రూ.12లక్షలు చోరీ చేశారు. అనంతరం జీడిపల్లి రిజర్వాయర్ వద్దకు చేరుకుని, చోరీ చేసిన సొమ్ములో రూ.50వేలు జానయ్య తన ఇంటి అవసరం కోసం తీసుకుని ఊరెళ్లాడు. మిగతా సొమ్మును పంచుకుందామని మిగిలిన ఇద్దరు భావించారు. అక్కడే ఉంటే పోలీసులు పట్టుకోవచ్చని కర్ణాటకలోని సిరిగుప్పకు బైక్‌లో బయల్దేరారు. చోరీ కేసు ఛేదించేందుకు కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు పర్యవేక్షణలో రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, కణేకల్లు, డీ.హీరేహాళ్ ఎస్‌ఐలు నాగమధు, గురుప్రసాద్‌రెడ్డి బృందాలుగా ఏర్పడ్డారు. వారితోపాటు కానిస్టేబుళ్లు సూర్యనారాయణ, అక్కులన్న, మోహన్‌కృష్ణ, మంజునాథ, కృష్ణరెడ్డి, రంగారెడ్డి కూడా వెళ్లారు. సిరిగుప్ప వైపు వెళ్తున్న దొంగలను కణేకల్లు క్రాస్ సమీపంలో పోలీసులు అరెస్టు చేశారు.

నిందితులపై పలు కేసులు...

గురునాథం రాజుపై కడప జిల్లా ఎర్రగుంట్ల, కర్నూలు జిల్లా హాలహర్వి పోలీసు స్టేషన్ల పరిధిలో చోరీ కేసులున్నాయి. దండపాణి కార్తీక్‌పై తమిళనాడు రాష్ట్రంలోని పోలూరు, శ్రీపెరంబూరు, కర్ణాటక రాష్ట్రం బొమ్మనహళ్లి, ఏపీలోని వి.కోట స్టేషన్ల పరిధిలో బైక్ చోరీ కేసులున్నాయి.


స్వాధీనం చేసుకున్న నగదు

వైసీపీ పాపం..!

శుద్ధి నీటి ప్లాంట్ మూత



నిరుపయోగంగా మారిన డాక్టర్ వాటర్ ప్లాంట్

కూడేరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాపం.. ప్రజలకు శాపంగా మారింది. ప్రజల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన శుద్ధి నీటి ప్లాంట్ మూతపడింది. ఐటీసీ కంపెనీ 2011లో డాక్టర్ వాటర్ ప్లాంట్‌ను కూడేరులో ఏర్పాటు చేసింది. రూ.2కే బిందె నీరు ఇచ్చేవారు. ఐదేళ్ల తరువాత వాటర్ ప్లాంట్‌ను పంచాయతీకి అప్పగించారు. సక్రమంగా నిర్వహిస్తుండేవారు. 2019లో వైసీపీ అధికారం చేపట్టాక ప్లాంట్ నిర్వహణ ఆ పార్టీ నాయకుల చేతుల్లోకి వెళ్లింది. దీంతో నిర్వహణ గాడితప్పింది. ప్లాంట్‌కు సంబంధించి కరెంటు బిల్లులు కూడా చెల్లించకపోవడంతో బంద్ చేశారు. దీంతో అధిక ధరలు వెచ్చించి ప్రైవేటు వాటర్ ప్లాంట్ల నుంచి శుద్ధి నీరు కొనుగోలు చేయాల్సి వస్తోందని పేద ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి, తక్కువ ధరకే శుద్ధి నీటిని సరఫరా చేసే వాటర్ ప్లాంట్‌ను పునఃప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

మద్దతు ధరతో పప్పుశనగ కొనుగోలు

ఆర్‌ఎస్‌కేల్లో రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోండి

ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి

అనంతపురం అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పప్పుశనగ ఉత్పత్తులను మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతిచ్చిందని ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో పప్పుశనగ విక్రయించాలనుకునే రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. క్వింటా పప్పుశనగ రూ.5650లుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ పంట నమోదు చేసుకున్న రైతులతో మాత్రమే పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. 14 శాతంలోపు తేమ శాతం ఉండేలా చూసుకోవాలన్నారు.

దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): గుత్తి మండలం గొల్లలదొడ్డి(సేవాఘడ్)లో ఉన్న గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో 5,6,7,8,9 తరగతుల్లో ఖాళీల ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి రామాంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలలో 5వ తరగతికి 80 సీట్లు ఖాళీలున్నాయి. ఎస్టీ బ్యాక్‌లాగ్ కింద 6వ తరగతిలో 49 సీట్లు, 7వ తరగతిలో 30, 8వ తరగతిలో 19, 9వ తరగతిలో 06 సీట్లు ఖాళీలున్నాయన్నారు. ఈ సీట్ల భర్తీలో ఎస్టీలకు 78 శాతం, ఎస్సీలకు 12, బీసీలకు 5, ఓసీలకు 2, ఏఈక్యులకు 3 శాతం చొప్పున సీట్లను కేటాయించడం జరుగుతుందన్నారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 25వ తేదీలోపు వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 6న గొల్లలదొడ్డి గిరిజన పాఠశాలలో రాత పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు పాఠశాల ప్రిన్సిపాల్‌ను 9885369079, 8978239363, 9550655840 నంబర్లలో సంప్రదించాలన్నారు.

న్యూస్ బాక్స్

నాన్ టీచింగ్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



అధ్యక్షుడు తిమ్మప్ప | ఉపాధ్యక్షుడు నాగమునీంద్ర | ప్రధాన కార్యదర్శి మారుతి

అనంతపురం సెంట్రల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ నాన్ టీచింగ్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికైంది. అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శుల ఎన్నికకు నోటిఫికేషన్ జారీచేయగా నామినేషన్లకు సోమవారం వరకు గడువు విధించారు. ఒక్కో పదవికి ఒకటి చొప్పున నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవంగా ఎన్నిక జరిగిందని రిటర్నింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించిన సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ తెలిపారు. అధ్యక్షుడిగా తిమ్మప్ప, ఉపాధ్యక్షుడిగా నాగమునీంద్ర, ప్రధాన కార్యదర్శిగా మారుతి ఎన్నికైనట్లు ప్రకటించారు.

ఉద్యోగాలకు పీవీకేకే విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో విద్యాసంస్థల చైర్మన్ తదితరులు

అనంతపురం రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ మారుతి సుజుకీలో ఉద్యోగాలకు పీవీకేకే ఐటీ పాలిటెక్నిక్ విద్యార్థులు ఆరుగురు ఎంపికయ్యారు. కళాశాలలో మంగళవారం ఆ సంస్థ ఆధ్వర్యంలో ఆన్ క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈసీఈ, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగా లకు చెందిన ఆరుగురు విద్యార్థులు అడ్వైజర్ హోదా ఉద్యోగాల కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ వైభవ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్ అభినందించారు.

ఆదరణ సేవా హోమ్‌కు నిత్యవసరాల వితరణ

అనంతపురం కల్చరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): నగరంలో వృద్ధులు, అనాధలకు సేవలందిస్తున్న ఆదరణ సేవా హోమ్‌కు షిర్డీసాయి అన్న వితరణ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం రూ.12వేలు విలువ చేసే నిత్యావసర సరుకులు అందజేశారు. ట్రస్టు సభ్యులు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

గార్లదిన్నె, మార్చి 11(ఆంధ్రజ్యోతి): విద్యా కమిటీ మాజీ చైర్మన్ గట్టు రామకృష్ణారెడ్డి మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలో మంగళవారం పది పరీక్షలు రాసే విద్యార్థులకు అట్ట లు, పెన్నులు అందజేశారు. ప్రతి యేటా మాదిరిగానే ఈ సంవత్సరం 84 మందికి పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుంకన్న, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూళ్లపై దృష్టి పెట్టండి

అనంతపురంరూరల్, మార్చి11(ఆంధ్రజ్యోతి):ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు వస్తున్న క్రమంలో ఇంటి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సాధించాలని ఎంపీడీఓ దివాకర్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో ఈఓఆర్డీ వెంకటనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరికుమార్‌తో కలసి ఆయన పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు.

గర్భిణులకు భోజన వసతి

నార్పల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులకు శివకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బొందవాడ శివకృష్ణచౌదరి ఆధ్వర్యంలో మంగళవారం భోజన సదుపాయం కల్పించారు. ట్రస్ట్ సభ్యులు రమేష్, సూరి, సాయి తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న 11 మంది అరెస్ట్

అనంతపురం క్రైం, మార్చి11 (ఆంధ్రజ్యోతి): నగరంలో పేకాడ దుతున్న 11 మందిని వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వన్ టౌన్ సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ ఆదేశాల మేరకు మంగళవారం దాడులు నిర్వహించారు. శ్రీకంఠం సర్కిల్ సమీపంలోని ఓ ఖాళీ స్థలంలో పేకాడుతుండగా 11మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.24,200 స్వాధీనం చేసుకున్నారు.

ఆదర్శ కాలనీలో 20 కుక్కల మృతి

నగరంలోని ఆదర్శకాలనీలో రెండు రోజుల వ్యవధిలో 20 వీధి కుక్కలు మృతి చెందాయి. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఆహార పదార్థాలలో విషపు గుళికలు ఉంచడంతో, వాటిని తిని ఆ కుక్కలు మృతి చెందినట్లు తెలుస్తోంది. మూగ జీవాలను ఇలా చంపడం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

పాసు పుస్తకాల ఖాతాకు విశిష్ట సంఖ్య ఇవ్వాలి

● ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

నార్పల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఏపీ ఫార్మా రిజిస్ట్రేషన్ పథకం కింద రైతు పాసు పుస్తకాల ఖాతాకు విశిష్ట సంఖ్యను రిజిస్ట్రేషన్ చేయాలని తహసీల్దార్ అరుణకుమారికి సీపీఐ నాయకులు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్పయాదవ్ మాట్లాడుతూ గతంలో రీసర్వే కారణంగా జరిగిన తప్పిదాలే ఇప్పుడు జరిగే అవకాశం ఉందన్నారు. అందుకోసం పాసు పుస్తకంలో ఉన్న అన్ని సర్వే నెంబర్లకు వివిష్ట నెంబర్లను కేటాయించాలన్నారు.

15న విజయవాడలో నిరసన దీక్షలు: ఎస్ఎఫ్ఐ

అనంతపురం కల్చరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15న విజయవాడలోని ధర్నా చౌక్‌లో నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ పేర్కొన్నారు. స్థానిక గణేనాయక్ భవన్‌లో మంగళవారం నిరసన దీక్షల పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు పెద్దసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గిరి, నగరాధ్యక్షుడు భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి: ఎంపీడీఓ

శింగనమల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రజా ప్రతినిధులు గ్రామాభివృద్ధికి సహకారం అందజేయాలని ఎంపీడీఓ భాస్కర్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నపై తహసీల్దార్ మాట్లాడుతూ... రీసర్వే వల్ల సమస్యలు వచ్చినది వాస్తవమేనని, గతనెల నుంచి వాటి పరిష్కారానికి అవకాశం వచ్చిందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. సభ్యులు మాట్లాడుతూ... గ్రామాల్లో చీనీ తోటలకు తెగుళ్ల సోకాయని, బోర్లులో నీరు లేక పోవడంతో చెట్లు ఎండిపోతున్నాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో మాదిరిగానే చీనీతోటలకు ట్యాంకుల ద్వారా నీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. పెద్దమట్లగొంది సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ... గత వైసీపీ పాలనలో నయా పైసా రాక గ్రామాభివృద్ధి జరగలేదని, ఈ ప్రభుత్వమైనా నిధులు కేటాయించాలన్నారు. గుమ్మేపల్లి సర్పంచ్ లలితమ్మ మాట్లాడుతూ గతంలో వచ్చిన నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిందని, ఈ ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుండటంతో పంచాయతీలు అభివృద్ధి బాటలో నడుస్తున్నాయన్నారు. పంచాయతీలోని పలు సమస్యలపై ఎంపీపీ యోగేశ్వరికి వినతి పత్రం అందజేశారు.

వైభవంగా అమ్మవార్ల జాతర



పాపినేపాళ్యంలో పూజలందుకుంటున్న చౌడేశ్వరీ దేవి

గార్లదిన్నె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కల్లూరు, పాపినేపాళ్యం గ్రామాల్లో మంగళవారం సుంకులమ్మ, చౌడేశ్వరిదేవి అమ్మవార్ల జాతర వైభవంగా జరిగింది. జాతర సందర్భంగా రెండు గ్రామాల్లో రెండు రోజుల నుంచి అమ్మవారి ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఆయా గ్రామాల్లో మంగళవారం ఉదయం భక్తులు అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జాతరను తిలకించడానికి వివిధ గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు తీసుకున్నారు. శింగనమల నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, మాజీ జడ్పీటీసీ రామలింగారెడ్డి, టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ, డీసీ చైర్మన్ శేఖర్, ఇల్లూరు రామాంజి, బాబయ్య, పాండు, గుత్తాబాలకృష్ణ, జయారం, అంజి, రాము, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు. దీంతో ఆయా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

నాగసముద్రంలో...

● చెన్నేకొత్తపల్లి: మండలపరిధిలోని నాగసముద్రం గ్రామంలో చెరువు కట్ట కింద వెలసిన గ్రామదేవత ముత్యాలమ్మ దేవతకు జ్యోతులు, బోనాల ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంక రించి పూజలు చేశారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున మహిళలు జ్యోతులు, బోనాలను తలపై ఎత్తుకుని ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో ముత్యాలమ్మ దేవతకు వాటిని సమర్పించి పూజలు నిర్వహించారు. స్థానికులే కాకుండా వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి ఈ ఉత్సవంలో పాల్గొన్నారు.



కల్లూరులో సుంకులమ్మను దర్శించుకుంటున్న టీడీపీ నాయకులు



నాగసముద్రంలో జ్యోతులు, బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్థులు

ఏ మొహం పెట్టుకుని యువపోరు చేస్తారు..?

● టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు



మీడియాతో మాట్లాడుతున్న ఆలం

అనంతపురం అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో విద్యార్థులు, యువతకు తీరని అన్యాయం చేసి, ఇప్పుడు ఏ మొహం పెట్టుకొని యువ పోరు పేరుతో ధర్నాలు చేస్తారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు మండిపడ్డారు. ఆయన మంగళవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 2019- 2024 మధ్య కాలంలో ఫీజు రీఎంబర్స్‌మెంట్‌ను విద్యా దీవెనగా పేరు మార్చి విద్యార్థులను ఉద్ధరిస్తామని చెప్పిన జగన్, వారి జీవితాలతో చెలగాటం ఆడారన్నారు. విద్యా దీవెన మంజూరు చేయకపోవడంతో వేలాది మంది విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారన్నారు. ఐదేళ్ల పాలనలో విద్యార్థులను పట్టించుకోని వైసీపీ నాయకులు ఏ మొహం పెట్టుకొని ఇప్పుడు యువ పోరు పేరుతో ధర్నాలకు సిద్ధమయ్యారో ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు.

జగన్ ఇంటి ఎదుట యువ పోరు చేయండి

● తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): జగన్ ఇంటి ఎదుట వైసీపీ దొంగల ముఠా యువ పోరు చేస్తే సరిగ్గా సరిపోతుందని తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి లక్ష్మీనరసింహ, టీఎన్ ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధనుంజయనాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురాం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ పాలనలో విద్యాదీవెన డబ్బులు సకాలంలో చెల్లించకుండా అన్యాయం చేసిన జగన్ ఇప్పుడు యువపోరు పేరుతో నిరసనలకు పిలుపునివ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

'పల్లె రఘునాథరెడ్డిని విమర్శించే స్థాయి నీకు లేదు'

అనంతపురం అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిని విమర్శించేస్థాయి ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్‌కు లేదని ఓసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పల్లె రఘునాథరెడ్డిపై అసత్య ఆరోపణలు చేసే ముందు ఆయన చరిత్ర ఎలాంటిదో, ఆయన పేద ప్రజలకు చేసిన సేవలు ఎలాంటివో తెలుసుకోవాలన్నారు.

యువత పోరును విజయవంతం చేయండి : మేయర్

అనంతపురం క్రైం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న యువత పోరును విజయవంతం చేయాలని నగర మేయర్ మహమ్మద్ వసీం పిలుపునిచ్చారు. మంగళవారం తన క్యాంపు కార్యాల యంలో యువత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు.

విజయలక్ష్మి కుటుంబానికి అండగా ఉంటాం

అనంతపురం క్రైం: నగరపాలికలో ప్లానింగ్ సెక్రటరీగా పనిచేస్తూ మృతి చెందిన విజయలక్ష్మి కుటుంబానికి అండగా ఉంటామని నగర మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో విజయలక్ష్మి సంతాపసభ నిర్వహించారు. మేయర్ వసీం, కమిషనర్ బాలస్వామి, డిప్యూటీ మేయర్లు విజయభాస్కర్‌రెడ్డి, సాహిత్య విజయలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బిల్ కలెక్టర్ మృతికి సంతాపం

నగరపాలికలో పనిచేస్తున్న బిల్ కలెక్టర్ శ్రీనివాసులు మృతి పట్ల నగర మేయర్ వసీం సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం శ్రీనివాసులు మృతి చెందారు. మేయర్, వైసీపీ యువజన నాయకుడు సాకే చంద్రశేఖర్ అతడి నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు.

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి11(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ పరిధిలో మహిళలకు ఇచ్చే ఉచిత టైలరింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకో వాలని ఆ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఈనెల 22వ తేదీలోపు సచివాలయం, ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మొల్లమాంబ జయంతిని ఘనంగా నిర్వహించండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి14(ఆంధ్రజ్యోతి): తొలి తెలుగు మహిళా కవయిత్రి, రామాయణ రచయిత అతుకూరి మొల్లమాంబ జయంతిని ఘనంగా నిర్వహించాలని టీడీపీ నాయకులు బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూ కొఠారని కోరారు. ఈ మేరకు టీడీపీ కుమ్మర, శాలివాహన సమితి రాష్ట్ర కన్వీనర్ పోతులయ్య, నాయకులు బానుకోట రామాంజినేయులు, రమణ, వెంకటనారాయణ, వెంకట లక్ష్మి, భారతి మంగళవారం కుష్బూకొఠారీని ఆమె ఛాంబర్‌లో కలిసి మాట్లాడారు.

పెండింగ్ నిధులు విడుదల చేయండి

● ఆర్థిక మంత్రికి పంచాయతీ రాజ్ చాంబర్ సభ్యుల వినతి



మంత్రి కేశవ్‌ను కలిసిన పంచాయతీరాజ్ చాంబర్ సభ్యులు

శింగనమల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ కాలంలో పెండింగ్‌లో ఉన్న 2017-18 సంవత్సరం ఎన్‌డీఎఫ్ 30 శాతం నిధులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ సభ్యులు కోరారు. రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డితో కలిసి మంగళవారం విజయవాడ లో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలసి సమస్యలపై వినతి పత్రం అందజేసినట్టు చాంబర్ కార్యనిర్వాక కార్యదర్శి డేగల కృష్ణమూర్తి తెలిపారు. అలాగే రాష్ట్ర మైనింగ్, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, సచివాలయ శాఖ మంత్రి డోలబాల వీరాంజినేస్వామిని మర్యాద పూర్వకంగా కలిసినట్లు డేగల తెలిపారు.

వైసీపీ నాయకుడి హల్‌చల్



సమావేశంలో మాట్లాడుతున్న మన్నిల శివయ్య

నార్పల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మేజరు పంచాయతీ నార్పలకు సర్పంచు కుమార్తెనా, తండ్రా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. పంచాయతీ పాలకవర్గం సమావేశంలో సర్పంచు సుప్రియ తండ్రి, వైసీపీ నాయకుడు మన్నిల శివయ్య వ్యవహరించిన తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. మంగళవారం నార్పల పంచాయతీ కార్యాలయంలో పాలకవర్గం సర్పంచు సుప్రియ అధ్యక్షతన పంచాయతీ అధికారులు సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వార్డు సభ్యులతో పాలకవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పలువురు వార్డు సభ్యులు డుమ్మా కొట్టారు. ఈ సమావేశంలో సర్పంచు మున్నిలా సుప్రియ సమావేశంలో మౌనంగా కూర్చున్నారు. వార్డు సభ్యుల ప్రశ్నలకు పంచాయతీ కార్యదర్శి శ్యామల సమక్షంలో సర్పంచు తండ్రి మున్నిలా శివయ్య సమాధానాలు చెప్పడంతో పలువురు వార్డు సభ్యులు అసహనం వ్యక్తం చేశారు.

మహిళలు ధైర్యంగా ముందుకు సాగాలి : ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

చెన్నేకొత్తపల్లి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ముఖ్యంగా సమాజంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకు పోవాలని ఎస్పీ వి.రత్న పిలుపు నిచ్చారు. టింబక్టుకలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చెన్నేకొత్తపల్లిలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా మహిళలతో గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక టింబక్టు కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. సంస్థ వ్యవస్థాపకులు మేరి వటమట్టం, ఏడీ సుకన్య, ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్, రామగిరి సీఐ శ్రీధర్, ఎస్ఐ సత్యనారాయణ, టింబక్టు మహిళా ప్రతినిధులు, సభ్యులు, లీడర్లు, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి

●చెన్నేకొత్తపల్లి: మహిళలు, బాలికల నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టిసారించాలని శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రత్న ఆదేశించారు. చెన్నేకొత్తపల్లిలోని పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించడంతో పాటు క్రైమ్ రికార్డులను తనిఖీ చేశారు. స్టేషన్‌పరిధిలో జరిగే నేరాల గురించి ఆరాతీశారు. ఎస్పీ వెంట ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ ఉన్నారు. రామగిరి సీఐ శ్రీధర్, ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి

● లీటర్ బేస్ విధానాన్ని రద్దు చేయాలి
● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు
● నీటి సరఫరా కార్మికుల నిరసన



డీఆర్ఓ మలోలకు వినతిపత్రం సమర్పిస్తున్న ఓబులు తదితరులు

అనంతపురం కల్చరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): శ్రీరామిరెడ్డి వాటర్ వర్క్స్ స్కీమ్ కార్మికుల పది నెలల వేతన బకాయిలు, 35 నెలల పీఎఫ్ బకాయిలను వెంటనే చెల్లించాలని సీఐటీ యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట కార్మికులతో కలిసి నిరసన చేపట్టారు. అనంతరం డీఆర్ఓ మలోలను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ... పగలు, రాత్రి తేడాలేకుండా పనిచేస్తున్న కార్మికులు వేతనాల కోసం సంవత్సరంలో మూడు దఫాలు సమ్మె చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. అందుకే బడ్జెట్‌లో కేటాయింపులు చేయాల్సిన అవసరముందన్నారు. ఈ మధ్యకాలంలో లీటర్ బేస్ విధానం వల్ల కరెంటు లేనప్పుడు, నాసి రకం పైపులు పగిలి పోయినప్పుడు ఆ ప్రాం తాలకు నీటి సరఫరాలో అంతరాయం కలుగుతోందన్నారు. మరోవైపు అత్తమీద కోపం దుత్తమీద తీర్చినట్లు కార్మికుల వేతనాల్లో రూ.2500 తగ్గించారని, వచ్చే నెలకూడా మరో రూ.2వేలు తగ్గించే ప్రయత్నంలో అధికారులు ఉన్నారని, ఇది సరికాదన్నారు. ఇప్పటికైనా కార్మికుల బకాయి వేతనాలు, పీఎఫ్ చెల్లించి, లీటర్ బేస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీరామిరెడ్డి వాటర్ సప్లయ్ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి రాము, కోశాధికారి హొన్నూరుస్వామి, ప్రభాకర్, సోము, చిక్కన్న, హనుమంత రాయుడు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తాతార్యారూఢస్వామి తిరునాళ్ల



ఆలంకరణలో స్వామి మూలవిరాట్

గార్లదిన్నె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మర్తాడు గ్రామంలో రెండు రోజుల పాటు తాతార్యారూఢ స్వామి తిరునాళ్లు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. మంగళవారం రాత్రి తాతార్యారూఢ స్వామి రథోత్సవం కన్నుల పండువగా సాగింది. వివిధ గ్రామాల నుంచి భారీ సం ఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. ఎస్ఐ మహమ్మద్‌గౌస్ బాషా ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అన్నింటా జిల్లా టాప్ 6లో ఉండాలి : కలెక్టర్

అనంతపురం టౌన్, మార్చి11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి అంశంలో జిల్లా టాప్-6లో ఉండాలని అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్.. అధికారులతో మంగళవారం కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. త్వరలో కలెక్టర్లతో సీఎం కాన్ఫరెన్స్ నిర్వహిస్తారన్నారు. ఆలోగా రాష్ట్రస్థాయిలో ఆయా అంశాల్లో జిల్లా టాప్-6లో ఉండేలా చూడాలన్నారు. ఇందుకు జిల్లాఅధికారులు కృషి చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎంఎస్ఎంఈ సర్వే పూర్తి చేయండి

జిల్లాలో ఎంఎస్ఎంఈ సర్వే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అర్బన్‌కు సంబంధించి నగరంలో 31,006 ఎంఎస్ఎంఈ పరిశ్రమలను సర్వే చేయాలని లక్ష్యం నిర్ధేశించారన్నారు. ఆ మేరకు సర్వే చేయాలన్నారు. నగరంలో 18 సచివాలయాల పరిధిలో పనితీరు బాగోలేదనీ, వేగవంతం చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్‌కు సూచించారు.

పనిచేయని ఏసీలు, ఫ్యాన్ల పరిశీలన

● నిర్లక్ష్యంపై సూపరింటెండెంట్, అడ్మినిస్ట్రేటర్ ఆగ్రహం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆస్పత్రిలో పనిచేయని ఏసీలు, ఫ్యాన్లను పరిశీలించిన సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్, డిప్యూటీ కలెక్టరు మల్లికార్జునరెడ్డి సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో నరకం, ఏసీలు, ఫ్యాన్లు పనిచేయక ఎండాకాల ంకావడంతో రోగులు పడుతున్న ఇబ్బందులపై ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనం ప్రచురించిన విషయం విదితమే. ఈ కథనం ఆస్పత్రి వైద్యాధికారులను కదిలించింది. మంగళవారం ఉదయంనుంచి సూపరింటెండెంట్, అడ్మినిస్ట్రేటర్‌తో పాటు ఆర్ఎంఓలు డాక్టర్ రామక్రిష్ణ, డాక్టర్ హేమలత, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శ్రీనివాసులు నాయుడు, విద్యుత్ మెకానిక్ సిబ్బందితో కలిసి ఆస్పత్రిలో కలియతిరిగారు. విభాగాల వారీగా పరిశీలించారు. వీటి మరమ్మతు విషయంలో నిర్లక్ష్యం చేసిన మెకానిక్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అవసరమైన విభాగాలలో మరమ్మతులు చేయించాలని ఈఈకి సూచించారు. వారంలోగా మరమ్మతులు చేయించి రోగులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని సూపరింటెండెంట్, అడ్మినిస్ట్రేటర్ తెలిపారు.

గ్లకోమాతో కంటిచూపునకే ప్రమాదం

● సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు

అనంతపురం టౌన్, మార్చి11(ఆంధ్రజ్యోతి): కంటిచూపును హరించే అదృశ్య శత్రువు గ్లకోమా అని, అలాంటి వ్యాధిపట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెం డెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు సూచించారు. మంగళవారం జిల్లా ఆస్పత్రి కంటి వైద్య విభాగం ఆధ్వర్యంలో గ్లకోమా నివారణ వారోత్స వాలను నిర్వహించారు. సూపరింటెండెంట్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ... ఈ వ్యాధి ఉన్నవారు ఒత్తిడి పెరగడంవల్ల చివరకు చూపు కోల్పోతారన్నారు. ప్రజలకు ఈవ్యాధిపై అవగాహన కల్పించాలని కంటి వైద్యవిభాగానికి సూచించారు. కంటి వైద్యవిభాగం డాక్టర్లు భవానీ, మంజుల, వైఎంఎస్ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షల డ్యూటీ నుంచి మినహాయించాలి

● డీఈఓకు యూటీఎఫ్ నాయకుల వినతి

అనంతపురం విద్య, మార్చి 11(ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న టీచర్లను పదో తరగతి పరీక్షల డ్యూటీ నుంచి మినహాయించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంఘం నాయకులు మంగళవారం డీఈఓ ప్రసాద్‌బాబును నగరంలోని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, ఇతర నేతలు మాట్లాడారు. పలు డిమాండ్లలో కూడిన వినతిపత్రం అందించారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శులు ప్రమీల, సుబ్బరాయుడు, ఇతర నాయకులు చంద్రమోహన్, ఆదిశేషప్ప, శ్రీనివాసులు, దస్తగిరి, ఓబుళపతి తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు వాయిదా వేయాలి

అనంతపురం విద్య, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 12న జరిగే స్కూల్ కాంప్లెక్స్ సమా వేశాలను వాయిదా వేయాలని ఏపీటీ ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్ మంగళవారం ప్రకటనలో డిమాం డ్ చేశారు. సమావేశాలు నిర్వహించాలంటూ ఆగమేఘాల మీద ఉత్తర్వులిచ్చారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు విధుల్లో టీచర్లు అనేక ఒత్తిళ్ల మధ్య ఉన్నారన్నారు. అలాగే పాఠశాల విద్యాశాఖ ఈ నెల 12న నిర్వహించే క్లస్టర్ మీటింగ్స్‌ను రద్దు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రంజాన్ మాసం, పదో తరగతి ఓపెన్ పరీక్షలు, రెగ్యులర్ పరీక్షలు నేపథ్యంలో ఈ సమావేశాలు రద్దుచేయా లని డిమాండ్ చేశారు.

కృత్రిమ కాలుకు నమోదు గడువు పొడిగింపు

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభా వంతుల సంక్షేమ శాఖ అందించే కృత్రిమ కాలు కోసం నమోదు గడువు పొడిగించినట్లు ఆ శాఖ ఉమ్మడి జిల్లా ఏడీ వినోద్ మంగళవారం తెలిపారు. అర్హులైన వారు ఈనెల 29వ తేదీలోపు బుడ్డప్ప నగర్‌లోని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ ఫోన్ నం.: 8639081464, 9110353497కు సంప్రదించాలన్నారు.

సంక్షిప్త వార్తలు

ముగిసిన బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

ఉరవకొండ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గవిమఠంలో వెలసిన చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం వసంతోత్సవంతో ముగిశాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవమూర్తిని పల్లకిలో ఎదురుబసవన్న గుడి వరకూ ఊరేగించారు. అనంతరం గవిమఠం ఆవరణంలో ఉన్న బావి వద్ద గంగ పూజ చేశారు. కంకణధార మండపంలో మట్టి కుండలలో మొలకెత్తిన నవధాన్యాలను బావిలోకి వదిలారు. సాయంత్రం అర్చకులు వసంతాలను ఒకరిపై ఒకరు చల్లుకున్నారు. కార్యక్రమంలో ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి, సహాయ కమిషనర్ రాణి, అర్చకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

యల్లనూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 7:30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల ట్రాన్స్‌కో అధికారి రవీంద్ర తెలిపారు. సబ్‌స్టేషన్‌లో 33 కేవీ లైన్ల మరమ్మతుల కారణంగా తిమ్మంపల్లి, కొడవండ్లపల్లి, ఆరవేడు, బుక్కాపురం, చింతకాయమంద, గొడ్డుమర్రి, లక్షుంపల్లి గ్రామాల్లో విద్యుత్ కోత ఉంటుందని ఆయన తెలిపారు.

బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమావేశం

యల్లనూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లక్ష్మీ వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణపై ఈఓ మురళీకృష్ణ మంగళవారం గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. స్థానిక వెంకటరమణస్వామి ఆలయంలో నిర్వాహకులతో చర్చించారు. దేవాలయానికి సంబంధించిన భూముల కౌలు మొత్తం వెంటనే చెల్లించాలని కౌలుదారులకు తెలిపారు. బకాయిలు చెల్లించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో అర్చకులు విజయ్ పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

గుత్తి రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లలదొడ్డి(సేవాఘడ్) వద్దగల గిరిజన గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతిలో 80, 6వ తరగతి 49, 7వ తరగతి 30, 8వ తరగతి 19, 9వ తరగతి 6 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 6న రాత పరీక్ష నిర్వహించి ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు.. 9885369079, 8978239363, 9550655840 నంబర్లకు సంప్రదించాలన్నారు.

శివాలయ నిర్మాణాన్ని కూల్చడం దారుణం

గుంతకల్లుటౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కసాపురం రోడ్డులోని మైనార్టీ కాలనీలో మున్సిపల్ రిజర్వు స్థలంలో శివాలయ నిర్మాణాన్ని మున్సిపల్ అధికారులు కూల్చడం దారుణం అని హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి సభ్యుడు రామాంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం కూల్చిన ప్రదేశాన్ని పలువురు నాయకులు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో సోమవారం మున్సిపల్ కమిషనర్ నయీమ్‌అహ్మద్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సత్తార్ సచివాలయ అధికారులతో ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఎక్స్‌కవేటర్‌తో బండలును తొలగించారన్నారు. హిందూదేవాలయాలే అక్రమ నిర్మాణాలని కనిపిస్తున్నాయని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రవిబాబు, వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి కసాపురం రవి, జనసేన నాయకులు పురుషోత్తం, శేఖర్, వీరేష్ పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

పామిడి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కమ్యూనిస్టు కాలనీలో సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ గుంతకల్లు నియోజకవర్గ కార్యదర్శి వీరభద్ర మాట్లాడుతూ... పోరాటాల ఫలితంగా నేడు మహిళలకు అనేక హక్కులు లభించాయన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నేతలు సబిరాబీ, హుస్సేన్‌బీ, మస్తానమ్మ, కాశీంబీ, రసూల్‌బీ, సీపీఐ నాయకులు ఓంకార్, బాల య్య, ఇమాం, చంద్ర, నూర్‌బాషా పాల్గొన్నారు.

15న వైద్య శిబిరం

తాడిపత్రి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక రోటరీక్లబ్ కార్యాలయంలో ఈనెల 15న మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు ఉచిత మెగా మూర్ఛవ్యాధి క్యాంప్ నిర్వహించనున్నట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. విజయవాడకు చెందిన ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ గోపాలం శివన్నారాయణ రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. వివరాలకు 9849215969, 9440603410 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఉపాధ్యాయుడికి శాలివాహన పురస్కారం

తాడిపత్రి, మార్చి11(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన ఓ కార్యక్రమంలో తాడిపత్రి మండలం యర్రగుంటపల్లిలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు రామాంజనేయులుకు శాలివాహన ప్రతిభా పురస్కారాన్ని ప్రదానం చేశారు. పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషిచేసిన రామాంజనేయులుకు తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతి సందర్భంగా అవార్డును శాలివాహన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రదానం చేశారు. 2018లో కూడా రామాంజనేయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డును కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ వీరయ్య, తెలంగాణ మాజీ డీజీపీ పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు రామాంజనేయులు

ఆరేళ్ల తర్వాత మోక్షం..!

ఆగిపోయిన పాఠశాల నిర్మాణ పనులు ప్రారంభం

ఉరవకొండ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదగవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆగిపోయిన పాఠశాల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఆరేళ్ల తర్వాత ఎట్టకేలకు మోక్షం లభించింది. 'ఇంకెన్నాళ్లీ అవస్థలు' అనే కథనం ఆంధ్రజ్యోతిలో గత ఏడాది డిసెంబరులో ప్రచురితమయింది. దీంతో మంత్రి కేశవ్ స్పందించి ఆర్ఎంఎస్ఏ కింద రూ.35 లక్షల నిధులు మంజూరు చేయించారు. 2017లో టీడీపీ హయాంలో ఆర్ఎంఎస్ఏ కింద రూ.60 లక్షలతో అదనపు తరగతి గదుల పనులు చేపట్టారు. రూ.20 లక్షల వ్యయంతో పనులను కూడా పూర్తి చేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో నిర్మాణం పనులను ఆపివేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో, ఆగిపోయిన పాఠశాల నిర్మాణ పనులకు కదిలిక వచ్చింది. నిర్మాణం పనులకు హెచ్ఎం, కాంట్రాక్టర్లు పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. గదుల నిర్మాణం పనులు చకచకా సాగుతున్నాయి. ఆగిపోయిన పాఠశాల నిర్మాణ పనులకు నిధులు విడుదల కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి గదుల కొరత తీరుతుందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.


పనులకు భూమిపూజ చేస్తున్న ఉపాధ్యాయులు, కాంట్రాక్టర్లు

బాధ్యతాయుతంగా పనిచేస్తేనే అభివృద్ధి: జేసీపీఆర్


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్ రెడ్డి

యాడికి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేస్తే ఆ ప్రాంతంలో అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తుందని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం యాడికిలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో మండలస్థాయి అధికారులు, పంచాయతీ అధికారులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. యాడికిలో పారిశుధ్య నిర్వహణ, సిబ్బంది కొరత, అవసరమైన యంత్రాలు తదితర సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. సమావేశంలో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ వీరరాజు, ఈఓపీఆర్డీ శశికళ, పీఆర్‌డీఈ యల్లమనాయుడు, ట్రాన్స్‌కో ఏఈ రాజారావు, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, సర్పంచు అనురాధ పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీకి పరామర్శ

రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఆదినారాయణను మంగళవారం తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. పదిరోజులక్రితం వాకింగ్‌కు వెళ్లిన ఆదినారాయణను ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. యాడికి వచ్చిన జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆయనను పరామర్శించారు. ఆయనతో పాటు టీడీపీ నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, వేలూరు రంగయ్య, రుద్రమనాయుడు, హరినాథ్‌రెడ్డి, లక్ష్మణ్, శేఖర్ ఉన్నారు.

మాజీ కౌన్సిలర్ మృతికి సంతాపం

తాడిపత్రి: పట్టణంలోని ఓంశాంతినగర్‌లో నివాసం ఉంటున్న మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పుల్లన్న మంగళవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంటివద్దకు వెళ్లి పుల్లన్న మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

మున్సిపల్ ఏఈ హరికృష్ణ కోసం పోలీసుల గాలింపు

గుంతకల్లుటౌన్, మార్చి11(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న ఏఈ హరికృష్ణ కోసం హిందూపురం పోలీసులు గుంతకల్లులో గాలింపు చర్యలు చేపట్టారు. సత్యసాయి జిల్లా హిందూపురంలో హరికృష్ణ పనిచేసేటప్పుడు సహచర ఉద్యోగినిని ప్రేమ పేరుతో మోసం చేసినట్లు హిందూపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఐదు రోజుల క్రితం కేసు నమోదయిందని ఎస్ఐ తెలిపారు. హిందూపురం పోలీసులు మంగళవారం మున్సిపల్ మున్సిపల్ కమిషనర్ నయీమ్‌అహ్మద్‌ను కలిశారు. ఏఈ హరికృష్ణ నాలుగు రోజుల క్రితం నుంచి ఈనెల 18 వరకు సెలవు పెట్టినట్లు కమిషనర్ పోలీసులకు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి: ఆర్డీఓ


మాట్లాడుతున్న ఆర్డీవో వసంత్‌బాబు

కళ్యాణదుర్గం రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆర్డీఓ వసంత్‌బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పౌరహక్కుల పరిరక్షణ, అత్యాచార నిరోధక చట్టం, డివిజనల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని డీఎస్పీ రవిబాబు, డీఎల్‌డీవో నాగేశ్వరరావుతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి నిజమైన బాధితులకు న్యాయం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సాంఘిక సంక్షేమశాఖాధికారి దామోదర్‌రెడ్డి, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మోహన్, రామాంజనేయులు, ఎంపీపీ మారుతమ్మ పాల్గొన్నారు.

దుకాణాలపై అధికారుల దాడులు

గుంతకల్లు టౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో చికెన్, మటన్, కిరాణా దుకాణాలపై తునికలు, కొలతలు అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ వైజీ శంకర్ దుకాణాలలో ఎలక్ట్రానిక్ తుకాలను పరిశీలించారు. పచ్చిచేపల దుకాణాలు-3, చికెన్, మటన్-7, కిరాణా, జనరల్ స్టోర్‌దుకాణలు-6, చౌకధాన్యపుడిపో-1, ఫ్రూట్ దుకాణంలో ప్రభుత్వ సీల్ లేనందున అపరాధ రుసుం కింద రూ.12,400 వసూలు చేసినట్లు సీఐ తెలిపారు.

దున్నపోతు దాడిలో ముగ్గురికి గాయాలు

కూడేరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాఠశాల సమీపంలో మంగళవారం రాత్రి ఇంటి బయట కూర్చున్న వారిపై దున్నపోతు దాడి చేయడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. హైస్కూల్ వీధిలో నివాసముంటున్న అలివేలమ్మ, నరసింహులు, ఈశ్వరమ్మ రాత్రి ఇంటి బయట కూర్చొని ఉండగా.. వేగంగా వచ్చిన దున్నపోతు వారిపై ఒక్కసారిగా దాడి చేసింది. ఈ దాడిలో ముగ్గురికి గాయాలు కావడంతో చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

దళారులకు విక్రయించి మోసపోవద్దు


పొలాలను పరిశీలిస్తున్న ఉమామహేశ్వరమ్మ

కళ్యాణదుర్గం రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన వేరుశనగ, మొక్కజొన్న, జొన్న వంటి ధాన్యాలను దళారులకు విక్రయించి మోసపోవద్దని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని బట్టువారిపల్లిలో పొలం పిలుస్తుంది కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సహజపద్ధతిలో పంటలను సాగు చేస్తున్న రైతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏ డీఏ యల్లప్ప, ఏఓ జగదీష్, పాల్వాయి, బొట్టువారిపల్లి సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

రాయదుర్గంరూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మల్లాపురం లేఅవుట్‌లో ఎలాంటి ఆధారాలు లేకుండా నిర్మించిన కట్టడాలను తొలగించారు. మంగళవారం తహసీల్దార్ నాగరాజు ఆదేశాల మేరకు అక్రమంగా నిర్మించుకున్న 9 బేస్‌మెంట్ కట్టడాలను ఎక్స్‌కవేటర్లతో తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. దళారులను నమ్మి మోసపోవద్దని తెలిపారు. కాలనీలో ఎలాంటి ఆధారాలు లేకుండా నిర్మించిన తొమ్మిది బేస్‌మెంట్లను తొలగించినట్లు తెలిపారు. అర్హులైన వారికి ప్రభుత్వం ఇంటిస్థలాలు ఇస్తుందన్నారు.

ఉత్సాహంగా కర్రసాము పోటీలు

యాడికి, మార్చి11(ఆంధ్రజ్యోతి): శివలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం యాడికిలో నిర్వహించిన కర్రసాము పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. 16మంది గ్రామీణ క్రీడాకారులు కర్రసాము పోటీల్లో పాల్గొన్నారు. ఆసక్తిగా కొనసాగిన పోటీల్లో మొదటి బహుమతిని నాగార్జున, రెండవ బహుమతిని శివకుమార్, మూడవ బహుమతిని మహేష్‌లు గెలుపొందారు. కార్యక్రమంలో ఈఓ దుర్గాప్రసాద్, గంగిరెడ్డి, నారాయణస్వామి, రాజగోపాల్‌నాయుడు, వేలూరి రంగయ్య, రుద్రమనాయుడు పాల్గొన్నారు.

టెన్నిస్ టోర్నీలో గుత్తి విద్యార్థి సత్తా

గుత్తి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఆర్ఆర్ ఎంబీఏ కళాశాలలో చదువుతున్న ప్లాండ్‌స్టోన్ అనే విద్యార్థి రాయలసీమ ఓపెన్ లాన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ద్వితీయ స్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్నకుమార్ తెలిపారు. గుంతకల్లులో రైల్వే ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఈనెల 1న టోర్నీ నిర్వహించారు. ఈ టోర్నీ డబుల్స్‌లో ద్వితీయ, సింగిల్స్‌లో ద్వితీయస్థానం సాధించి రన్నర్‌గా నిలిచాడు. కళాశాలలో ఆ విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, సీఈఓ శ్రీరాములు పాల్గొన్నారు.


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

రెవెన్యూ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే


మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

తాడిపత్రి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): అమరావతిలో రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను మంగళవారం ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పలు అంశాలపై రెవెన్యూ మంత్రితో చర్చించినట్లు తెలిపారు. పేదలకు ఇచ్చిన పట్టాలపై ప్రొవిజన్ సర్టిఫికెట్ ఆలస్యమవుతోందని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో పేదలు ఇళ్లు కట్టుకోలేకపోతున్నారని, దీనివల్ల పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి వివరించారు.

బ్యూటీషియన్ లలితకు అవార్డు


అవార్డు అందుకుంటున్న లలిత

గుంతకల్లు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో న్యూలుక్ బ్యూటీ సెలూన్ నిర్వహిస్తున్న ఎల్.లలిత అనే బ్యూటీషియన్‌కు హైపెడ్జ్ సంస్థ, షీ ఇన్‌స్పైర్ మ్యాగజైన్ ఆధ్వర్యంలో బెస్ట్ కాస్మెటాలజిస్ట్ అండ్ బ్యూటీషియన్ అవార్డు లభించింది. మహిళా దినోత్సవం సందర్భంగా హైపెడ్జ్ సంస్థ, షీ ఇన్‌స్పైర్ మ్యాగజైన్ సంస్థ వివిధ రంగాల్లో రాణించి ప్రతిభ చాటిన మహిళలకు ఉమెన్ ఆఫ్ సబ్‌స్టాన్స్ నెట్‌వర్క్ అండ్ అవార్డ్ పేరిట పురస్కారాలను అందజేశారు. గత సంవత్సరంలో చెన్నైలో నిర్వహించిన పోటీల్లో వరల్డ్ బ్యూటీ అండ్ ఎస్థెటిక్ ఐకాన్ అవార్డును లలిత దక్కించుకున్నారు. ఈ మేరకు హైపెడ్జ్ సంస్థ, షీ ఇన్‌స్పైర్ మ్యాగజైన్ ఆధ్వర్యంలో ప్రతిభ కలిగిన మహిళల జాబితాలో లలిత ఎంపికయ్యారు. మంగళవారం ఉదయం న్యూఢిల్లీలోని హైపెడ్జ్ సంస్థ కార్యాలయంలో లలితకు బెస్ట్ కాస్మెటాలజిస్ట్ అండ్ బ్యూటీషియన్ పురస్కారాన్ని అందజేశారు.

హనుమద్ వాహనంపై చెన్నకేశవుడు


హనుమద్‌వాహనంపై చెన్నకేశస్వామి

యాడికి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక శివలక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం చెన్నకేశవస్వామి హనుమద్ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి స్వామివారిని హనుమద్ వాహనంపై గ్రామ ప్రధాన వీధుల గుండా ఊరేగించారు.


తాగునీటి సమస్య పరిష్కారం

బెళుగుప్ప, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపురం, హనిమిరెడ్డిపల్లి ఎస్సీ కాలనీలో పయ్యావుల సోదరుల సహకారంతో తాగునీటి సమస్య పరిష్కారమైనట్లు ఆ గ్రామాల టీడీపీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం రాత్రి గ్రామాల్లో బోరు వేయడంతో పుష్కలంగా నీరు వస్తున్నాయని నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

కంకర అన్‌లోడ్ చేస్తుండగా వ్యక్తికి తీవ్రగాయాలు

యాడికి, మార్చి11(ఆంధ్రజ్యోతి): లారీలో నుంచి కంకర అన్‌లోడ్ చేస్తుండగా యాడికి మండలం రాయలచెరువు గ్రామానికి చెందిన ప్రకాష్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మంగళవారం బళ్లారి సమీపాన ఉన్న దన్‌పూర్ వద్ద ఒక సిమెంట్ కర్మాగారంలో ఈ ఘటన జరిగింది. బాధితుడికి ఎడమ భుజం పూర్తిగా తొలగిపోయింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో హల్‌చల్ చేసింది. రాయలచెరువు గ్రామానికి చెందిన ప్రకాష్ లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కర్నూలు జిల్లా కొలిమిగుండ్ల నుంచి కంకరను లోడ్ చేసుకొని బళ్లారి జిల్లా దన్‌పూర్ వద్ద సిమెంట్ ఫ్యాక్టరీలో అన్‌లోడ్ చేయడానికి వెళ్లాడు. కంకర అన్‌లోడ్ చేస్తున్న సమయంలో ఎక్స్‌కవేటర్‌తో కంకర లాగుతున్న సమయంలో పుల్లర్ ప్రకాష్ ఎడమ భుజంపై పడినట్లు తెలుస్తోంది. అదే సమయంలో ప్రకాష్ కంకరలో పూర్తిగా ఇరుక్కుపోయాడు. ఘటనలో అతడి ఎడమభుజం పూర్తిగా దెబ్బతినిందని రాయలచెరువు గ్రామస్థులు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు.

అంగన్‌వాడీ కోడి గుడ్లలో పురుగులు


కోడి గుడ్లలో బయటపడిన పురుగులు

కూడేరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పి. నారాయణపురం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో పంపిణీ చేసిన కోడిగుడ్లలో పురుగులు బయటపడ్డాయి. అలివేలమ్మ అనే బాలింతకు అంగన్‌వాడీ కేంద్రంలో ఐదు రోజుల క్రితం కోడిగుడ్లు పంపిణీ చేశారు. మంగళవారం రాత్రి బాలింత అలివేలమ్మ గుడ్లను పరిశీలించగా పురుగుల ఉండటంతో అవాక్కయ్యారు. ఈ విషయంపై సీడీపీఓ శ్రీదేవిని వివరణ కోరగా.. బాలింతకు ఇచ్చిన కోడిగుడ్లు పాడై ఉంటే వేరే గుడ్లు పంపిణీ చేస్తామని తెలిపారు.

ఎంపీడీఓపై చర్యలు తీసుకోండి

రాష్ట్ర కమిషనర్‌కు వైసీపీ నాయకుడి ఫిర్యాదు

విడపనకల్లు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలో గతంలో పని చేసిన ఎంపీడీఓ శ్రీనివాసులుపై చర్యలు తీసుకోవాలని సోమవారం తాడేపల్లిలోని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు డొనేకల్లుకు చెందిన వైసీపీ నాయకుడు బోయ రాంబాబు తెలిపారు. ఎంపీడీఓగా పని చేసే సమయంలో శ్రీనివాసులు గ్రామ పంచాయతీ తీర్మానాలు లేకుండా ఉపాధి హామీ పనులు చేయించినట్లు పేర్కొన్నారు. ఆర్ కొట్టాల-డొనేకల్లు రోడ్డును నిర్మించకున్నా రూ.18.36లక్షలు డ్రా చేశాడని ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఎన్నో అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఎంపీడీఓపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

హంద్రీనీవా లైనింగ్ పనులను ఆపాలి: విశ్వేశ్వర రెడ్డి

కూడేరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువకు లైనింగ్ పనులను వెంటనే ఆపాలని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కూడేరులో హంద్రీనీవా కాలువ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హంద్రీనీవా నీటిని కుప్పం తరలించేందుకు కాలువ లైనింగ్ పనులు చేయడానికి ప్రభుత్వం టెండర్లు పిలిచిందని, త్వరలోనే పనులు చేయడానికి కాంట్రాక్టర్ సిద్ధమవుతున్నారని అన్నారు. లైనింగ్ పనులతో కాలువ కింద నున్న బోరు బావుల్లో భూగర్భ జలాలు తగ్గిపోయి రైతాంగం పూర్తిగా నష్టపోతారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణరెడ్డి, మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, పీసీఎం నాయకులు వీరప్ప, నారాయణరెడ్డి, ఏఐకేఎంఎస్ జిల్లా కోశాధికారి రాయుడు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

బొమ్మనహాళ్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె 2024-25 సంవత్సర వార్షిక రికార్డులను తనిఖీ నిర్వహించారు. గ్రంథాలయ రికార్డులు, పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న గ్రంథాలయ పన్ను బకాయిలు వెంటనే వసూలు చేయాలని గ్రంథాలయాధికారి ప్రసాద్‌కు సూచించారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

పుట్లూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపల్లికి చెందిన పర్వతాలు అనే వ్యక్తిని మడ్డిపల్లికి చెందిన నారపరెడ్డి అనే వ్యక్తి కులం పేరుతో దూషించడంతో కేసు నమోదు చేసినట్లు మంగళవారం పోలీసులు తెలిపారు. మూడేళ్ల క్రితం పర్వతాలు వద్ద నుంచి నారపరెడ్డి 14 గొర్రెలను రూ.1.90 లక్షలకు కొనుగోలు చేశాడన్నారు. తక్షణమే రూ.90 వేలు చెల్లించాడని, మిగతా డబ్బులు ఇవ్వాలని అడుగుతుంటే కులం పేరుతో దూషిస్తూ అసభ్య పదజాలంతో మాట్లాడారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటనరసింహ తెలిపారు.

గుండెపోటుతో అర్చకుడి మృతి



కణేకల్లు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ అర్చకుడు వెంకటరమణ (55) గుండెపోటుతో సోమవారం రాత్రి మృతి చెందారు. అనేక ఏళ్లుగా అర్చకుడిగా ఉన్న వెంకటరమణ హఠాన్మరణంతో ఆలయ భక్తుల్లోనూ, కుటుంబసభ్యుల్లోనూ విషాదం నెలకొంది. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

బెళుగుప్ప, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు మంగళవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు. నిందితుడి కోసం గాలిస్తున్నామని తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రాయదుర్గంరూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్‌బీవంక గ్రామంలో అక్రమంగా కర్ణాటక మద్యాన్ని అమ్మకాలు చేస్తున్న ఇద్దరు మహిళలను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ మహేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. మద్యం విక్రయాలపై సమాచారం రావడంతో ఎస్ఐ సత్యనారాయణతో కలిసి లక్ష్మీబాయి, సునంద అనే ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 75 కర్ణాటక మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.